# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 18-2-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:157 పేజీలు:6 వెల: రూ.1/-


### చురక



కొసవెల్లదు పొత్తుల
కుటిల రాజకీయం
స్వార్థంతో దేనినైనా
చీల్చుతుంది ఖాయం.

ఉమ్మడి ఎజెండా ఊపు
ఉనికి కొంతవరకే
ప్రతీపార్టీ తమ జెండా
పవర్ పెంపు కొరకే

-వేల్పుల నారాయణ
9440433475

## కేసీఆర్‌కు బర్త్ డే విషెస్ తెలిపిన సీఎం రేవంత్..

హైదరాబాద్, ఫిబ్రవరి 17:తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఇవాళ ఓ ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇరిగేషన్ శ్వేత పత్రంపై అధికార-ప్రతిపక్షం నడుమ వాడీవేడిగా వాదనలు జరుగుతున్న టైంలో సీఎం రేవంత్ రెడ్డి తన సీటులోంచి లేచారు. మాజీ సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీ తరుపున కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన పూర్తి ఆయురారోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు.

అలాగే.. ప్రధాన ప్రతిపక్షనేతగా ఆయన ప్రభుత్వానికి సహకరిస్తూ తెలంగాణ పునర్ నిర్మాణంలో.. అభివృద్ధికి దోహదం చేయాలని కోరుకుంటున్నట్లు రేవంత్ రెడ్డి అన్నారు. ఆయన పూర్తిగా ఆరోగ్యంతో ఉండాలని, ఆయన మరింత కాలం తెలంగాణ ప్రజలకు సేవలు అందించాలని తమ పార్టీ, ప్రభుత్వం కోరుకుంటున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పండి- రేవంత్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్, ఫిబ్రవరి 17:మాజీ మంత్రి హరీష్ ఆరోపణలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇస్తూ? గత ప్రభుత్వ తప్పులు ఒప్పుకొని తెలంగాణ సమాజానికి క్షమాపణ చెబితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఇంకా కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నమే చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తప్పులు ఒప్పుకొని సరిచేసేందుకు సలహాలు ఇస్తే.. ఇప్పుడైనా సమాజం అభినందించేది అని గుర్తుచేశారు.

ఎదురు దాడే .. సిగ్గు చేటు..

ఎదురుదాడికి దిగడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను తప్పుల తడక అంటున్నారని విమర్శించారు. తెలంగాణ ఇచ్చింది తామే.. తెచ్చింది మేమే అని రేవంత్ తేల్చి చెప్పారు. పార్లమెంట్‌లో స్ప్రే బారిన పడింది తమ ఎంపీలే అని గుర్తుచేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు కట్టలన్నది కేసీఆర్ ఆలోచనే అని తెలిపారు. మేడిగడ్డ పాపాలకు కేసీఆర్, హరీష్ రావు ఇద్దరే కారణమని చెప్పారు.

ఇదే ప్రాజెక్టును తుమ్మిడిహట్టి దగ్గరే కడితే మంచిదని ఇంజినీర్లు సిఫార్లు చేశారన్నారు. 151 మీటర్లతో ప్రాజెక్ట్ నిర్మించాలని పదే పదే చెప్పారన్నారు.. మహారాష్ట్ర అభ్యంతరం వ్యక్తం చేస్తే 150 మీటర్లు అయినా మంచిదే నిర్మించారని, అయితే తాజాగా మేడిగడ్డ బ్యారేజ్ నిరుపయోగమని ఇంజినీర్లు తేల్చారని గుర్తుచేశారు. ఐదుగురు ఇంజినీర్ల బృందం స్పష్టంగా చెప్పిన విషయం ఇది అని తెలిపారు. వాస్తవాలు బీఆర్ఎస్ నేతలు గ్రహించాలని రేవంత్ కోరారు.

## మేడారం జాతరకు నోడల్ అధికారులుగా అయిదు ఐఏఎస్ లు..

ములుగు , ఫిబ్రవరి 17:మేడారం జాతరకు నోడల్ అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం ఐదుగురు ఐఏఎస్ అధికారులను నియమించింది. ఆర్వీ కర్ణన్, కృష్ణ ఆదిత్య, ఆదర్శ్ సురభి, ప్రతిమా సింగ్, రాధికా గుప్తలకు ప్రభుత్వం జాతర బాధ్యతలు అప్పగించింది.

కాగా, ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మేడారం జాతర జరుగనుంది. ఇప్పటికే ఈ జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 75 కోట్ల నిధులు మంజూరు చేయగా.. కేంద్ర ప్రభుత్వం రూ. 3 కోట్లు కేటాయించింది. మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు నిత్యం అక్కడే ఉండి జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఆరువేల ప్రత్యేక బస్సులు కేటాయించారు. కొత్తగా హెలికాప్టర్ సేవలు కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నారు..

## మేడారం జాతరకు ఆర్టీసీ సర్వం సిద్ధం.. మంత్రి సీతక్క





హైదరాబాద్, ఫిబ్రవరి 17: ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ఆర్టీసి సర్వం సిద్ధమైందని రాష్ట్ర పంచాయతీరాజ్ మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఈ మేరకు శనివారం మేడారం జాతర కోసం ప్రత్యేకంగా అరవై ఎకరాల స్థల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బస్ స్టాండు ప్రాంగణాన్ని మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేకంగా ఆరువేల బస్ లను నడపడానికి సిద్ధంగా ఉందని, మహాలక్ష్మి పథకం ద్వారా జాతరకు మహిళా భక్తులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి భక్తుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, మహిళలు ఆర్టీసి ఉచిత ప్రయాణం కల్పించిందని అన్నారు.

పైసా ఖర్చు లేకుండా దర్శనం చేసుకునే ఏకైక జాతర మేడారం అని అన్నారు. గతంలో వేలాది మంది భక్తులు కాలినడకన వచ్చి తల్లులకు మొక్కులు చెల్లించుకునే వారన్నారు. కానీ నేడు సీఎం రేవంత్ రెడ్డి మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం ఏర్పాటు చేసారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులు ఓపికతో బస్సులు నడపాలని, భక్తులతో మర్యాదగా వ్యవహరించాలని మంత్రి సీతక్క కోరారు.ఆర్టీసి ఉద్యోగులు ఆడుతూ పాడుతూ పనిచేసి ప్రయాణం చేసే భక్తులు సంతోషంగా వచ్చి వెళ్లేలా చూడాలన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. గత జాతరతో పోలిస్తే ఈ సారి జాతరకు ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు అరవై ఎకరాల స్థల విస్తీర్ణంలో సువిశ్శాల బస్టాండ్ ప్రాంగణం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ 18తేదీ నుంచి 25వ తేదీ వరకు భక్తులకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.శ్రీజ, ఏటూరు నాగారం అదనపు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వరంగల్ ఆర్ ఎం శ్రీలత, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రత్యేక రైళ్ళు

**-కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి**

హైదరాబాద్ ఫిబ్రవరి 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );తెలంగాణ కుంభమేళా మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. జాతర సందర్భంగా ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ప్రత్యేక రైళ్లు భక్తుల సౌకర్యార్థం నడుస్తాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సికింద్రాబాద్-వరంగల్, నిజామాబాద్-వరంగల్, సిర్పూర్ కాగజ్‌నగర్-వరంగల్ మార్గంలో నడుస్తాయని తెలిపారు. బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి, జమ్మికుంట, భువనగిరి, జనగాం, ఘన్‌పూర్, కామారెడ్డి, మనోహరాబాద్, మేడ్చల్, ఆలేరు ప్రాంతాలకు చెందిన వారికి ఉపయోగపడనున్నాయి.సిర్పూర్ కాగజ్‌నగర్-వరంగల్-సిర్పూర్ కాగజ్‌నగర్ (07017/07018), సికింద్రాబాద్-వరంగల్-సికింద్రాబాద్ మధ్య (07014/07015) నిజామాబాద్- వరంగల్-నిజామాబాద్ (7019/07020) రైళ్లు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రభుత్వం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, గిరిజన సంక్షేమం విషయంలో చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే జాతరకు ప్రత్యేక రైళ్లు వేయడంతో పాటుగా జాతర ఏర్పాట్ల కోసం రూ. 3కోట్లను కేటాయించిందని వివరించారు.

## పాత మునిసిపల్ కార్పొరేషన్ భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఫిబ్రవరి 17:(నేటి నిజం ప్రతినిధి): పాత మునిసిపల్ కార్పొరేషన్ భవనాన్ని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి శనివారం పరిశీలించారు.

భవనం శిథిలావస్థలో ఉండి, ఉపయోగంలో లేదని కలెక్టర్ అన్నారు. పెవిలియన్ గ్రౌండ్ వద్ద ఉన్న జిల్లా గ్రంథాలయం ఇటీవల కూలిపోగా, అట్టి ప్రదేశంలో నిర్మించనున్న నూతన భవన నమూనాను కలెక్టర్ ఈ సందర్భంగా పరిశీలించారు. పాఠకులకు అన్ని వసతులతో భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శిక్షణా సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్డీసి ఎం.రాజేశ్వరి, గ్రంథాలయ కార్యదర్శి మంజువాణి, విద్యాశాఖ ఇఇ నాగశేషు, మునిసిపల్ డిఇ మాధవి, టిపిఓ సాయి, అధికారులు తదితరులున్నారు.





### నేటి కందం- నేటికి అందం



కావిరియగు యోచనతో
బావురుమనిపించగ పరపాలక గణముల్
నావికుల తిరుగుబాటుగ
భావించి లిఖించినారు స్వాతంత్ర్యేచ్ఛన్

(18-2-1946 ఇంగ్లీషు వారికి వ్యతిరేకంగా భారత నావికులు తిరుగుబాటు చేసినరోజు)

-రాధశ్రీ
సెల్:9494481210

## బోనకల్‌లో అట్టహాసంగా సేవాలాల్ జయంతి వేడుకలు

**– సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించడం బంజారాలందరకి దక్కిన గౌరవం: బీపీ నాయక్**



ఖమ్మం, ఫిబ్రవరి 17:(నేటి నిజం ప్రతినిధి): బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా మండలంలోని రైతు వేదిక ఆవరణంలో ప్రజా ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటుచేసిన సేవాలాల్ జయంతి ఉత్సవాలు భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేత బీపీ నాయక్. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక తహసీల్దార్, ఆర్ఐ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ సైదా నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ మధుబాబు, వైస్ ఎంపీపీ గుగులోత్ రమేష్, మాజీ జడ్పిటిసి కొండ, బిజెపి నేత గుగులోత్ నాగేశ్వరరావు, గిరిజన సంఘ నేతలు గుగులోత్ పంత్, గుగులోత్ కిషోర్ లు పాల్గొన్నారు. మొదటిగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలవాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం గిరిజనుల ఆచారం ప్రకారం భోగ్ బండార్ నిర్వహించి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా బీపీ నాయక్ మాట్లాడు తూ.. .సమాజ శ్రేయస్సు కోసం వారు చూపించిన మార్గం ఆదర్శనీయమని, సేవాలాల్ జయంతి దినోత్సవాన్ని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించడం హర్షనీయమని, బంజారాహిల్స్ లో బంజారా భవన్, ట్యాంకు బండి పై సేవాలాల్ విగ్రహాన్ని ప్రతిష్టించాలని, గిరిజన సమస్యల పరిష్కారానికి స్పెషల్ లోకయుక్త కోర్టును ఏర్పాటు చేయాలని, రిజర్వేషన్లు పకడ్బందీగా అమలు చేయాలని, గిరిజన ఆచార వ్యవహారాలను, సాంప్రదాయాలను కట్టుబాట్లను కాపాడే విధంగా ప్రణాళికలు చేయాలని, గిరిజన ఆలయాల్లో ధూప దీప నైవేద్య కార్యక్రమాల సంఖ్యను పెంచాలని, ఐక్యతతో గిరిజన సమాజం మరింత అభ్యున్నతి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, భానోత్ శ్రీను, గుగులోతు రామకృష్ణ, రూప్లా నాయక్, భూక్యా సైదులు, బానోత్ శ్రీనివాస రాథోడ్, కోటేశ్వరరావు, గుగులోత్ శ్రీను, భూక్య రమేష్ నాయక్, బాదావత్ సూర్య, వేణు, భూక్య గోపి, ఠాగూర్ వెంకటేశ్వర్లు, గుగులోతు గోపి, దుర్గా, త్రివేణి తదితర నాయకులు పాల్గొన్నారు.

## నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఈ14..



హైదరాబాద్, ఫిబ్రవరి 17:వాతావరణ పరిస్థితులను మరింత మెరుగ్గా అధ్యయనం చేసే ప్రక్రియ ఇప్పుడు మరింత సులువు కానుంది. ఇన్‌శాట్-3డీఎస్ అనే కొత్త వెదర్ శాటిలైట్‌ను భారత అంతరిక్ష ప్రయోగ సంస్థ (ఇస్రో) విజయవంతంగా ప్రయోగించింది. ఈ ఉపగ్రహాన్ని మోసుకొని ఎస్ఎల్వీ-ఎఫ్ 14 నింగిలోకి దూసుకెళ్లింది. 2275 కిలోల బరువుగల ఈ ఉపగ్రహాన్ని ఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టనుంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్ నుంచి దీన్ని ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది.

ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైతే వాతావరణ పరిస్థితులను మరింత మెరుగ్గా తెలుసుకోవచ్చు. భూమి, సముద్ర ఉపరితల మార్పులపై అధ్యయనానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. తద్వారా విపత్తులను ముందే పసిగట్టి హెచ్చరించవచ్చు.

## ఇన్‌శాట్ 3డీఎస్ ప్రయోగం విజయవంతం.. అభినందనలు తెలిపిన చైర్మన్

హైదరాబాద్, ఫిబ్రవరి 17:భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన ఇన్‌శాట్ 3డీఎస్ ప్రయోగం విజయవంతమైంది. జీఎస్ఎల్వీ- ఎఫ్ 14 వాహక నౌక ద్వారా ఇస్రో ఇన్‌శాట్ డీఎస్ శాటిలైట్‌ను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. శ్రీహరికోటలోని షార్ రెండో నెంబర్ లాంచ్‌ప్యాడ్ నుంచి సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం కోసం శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు ప్రారంభమైంది. కౌంట్‌డౌన్ 27.30 గంటల పాటు నిరంతరాయంగా కొనసాగింది.

ఇన్‌శాట్ 3డీఎస్ ఉపగ్రహం ద్వారా వాతావరణ పరిశీలనలను మెరుగుపరిచేందుకు.. భూమి, సముద్ర ఉపరితల వాతావరణం అధ్యయనం చేయనుండగా.. పరిశోధనల కోసం ఇస్రోకు మెరుగైన సమాచారం అందించనున్నది.

శాటిలైట్ పదేళ్ల పాటు ఇస్రోకి సేవలు అందించనున్నది. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ మాట్లాడుతూ ప్రయోగం విజయవంతమైనట్లు ప్రకటించారు. శాస్త్రవేత్తల బృందానికి అభినందనలు తెలిపారు.

అనుకున్న విధంగానే ఇన్‌శాట్ 3డీఎస్ ఉపగ్రహాన్ని జీఎల్ ఎల్వీ-ఎఫ్14 విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టిందని వెల్లడించారు. ఇన్‌శాట్ ప్రయోగం విజయవంతమైందని చెప్పేందుకు సంతోషిస్తున్నానన్నారు. నిర్దేశించి విధంగానే రాకెట్ కక్ష్యలో ప్రవేశించిందని.. ప్రక్రియ అంతా సాఫీగా సాగిందన్న ఆయన.. మిషన్‌లో పాలుపంచుకున్న శాస్త్రవేత్తలు, సిబ్బంది అందరికీ అభినందనలు తెలుపుతున్నానన్నారు.

ఇన్‌శాట్ 3డీఎస్‌తో ఖచ్చితమైన సమాచారం అందుతుందన్నారు. భూ, సముద్ర వాతావరణంపై ఖచితత్వంతో సమాచారం సాధ్యమవుతుందన్నారు. ప్రయోగం విజయవంతంగా నిర్వహించిన ఇస్రో బృందానికి కేంద్రమంత్రి జితేంద్రసింగ్ అభినందనలు తెలిపారు. అంతరిక్షరంగంలో అనేక విషయాలు సాధించామన్నారు. మోదీ ప్రోత్సాహంతో ఇస్రో వరుస విజయాలు సాధిస్తుందని పేర్కొన్నారు.

## 370 సీట్లు గెలవడమంటే ముఖర్జీకి నివాళి ఇవ్వడమే: ప్రధాని మోదీ



ఢిల్లీలో బీజేపీ పార్టీకి చెందిన ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. ఆ మీటింగ్‌లో ప్రధాని మోదీ మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల కోసం ఎలా ప్రచారం చేయాలన్న అంశాలను ఆయన తమ పార్టీ వర్గీయులకు దిశానిర్దేశం చేశారు. పేద ప్రజల కోసం తమ ప్రభుత్వం ఎలా పనిచేసింది, దేశ అభివృద్ధి, ప్రపంచవ్యాప్తంగా భారత ర్యాంకింగ్ ఎలా పెరిగిందన్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 370 సీట్లు గెలవడం తమ పార్టీ సిద్ధాంతకర్త శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నిజమైన నివాళి అవుతుందన్నారు. ఆర్టికల్ 370ని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించినట్లు మోదీ గుర్తు చేశారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పించే ఆ ఆర్టికల్‌ను బీజేపీ సర్కారు 2019 ఆగస్టులో రద్దు చేసిన విషయం తెలిసిందే. పోలింగ్ బూత్‌లపై దృష్టిపెట్టాలని ప్రధాని మోదీ తమ పార్టీ ఆఫీస్ బేరర్లను కోరారు.

## బీసీల ఆకాంక్షలను గౌరవించిన కాంగ్రెస్

**-కులగననకు తీర్మానమే మేలు చట్టంతో పనిలేదు**

**-కుల గణన పై త్వరలోనే మేధావులతో వర్క్ షాప్**

**- కులగనన పై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం**

**-కుల గణన కోసం ప్రత్యేక చొరవ చూపిన రేవంత్, బట్టి, పొన్నం కు ధన్యవాదాలు**

**-బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**

హైదరాబాద్ ఫిబ్రవరి 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో సమగ్ర కుల గణన చేయడానికి ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల ఆకాంక్షలను నెరవేర్చి బీసీల మనోభావాలను గౌరవించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అలాగే చారిత్రకమైన నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ పార్టీకి ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి . డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, అలాగే బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు సమస్త సమాజం తరపున ఆయన ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుల గణన నిర్వహించాలని రాష్ట్ర అసెంబ్లీ లో ఏకగ్రీవ తీర్మానం ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఈరోజు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్త ంగా అన్ని జిల్లా నియోజకవర్గ మం డల కేం ద్రాల్లో “బిసి కులగనణ సాధన విజ యోత్సవల” ను పెద్ద ఎత్తున నిర్వహి ంచారు. అందులో భాగంగానే ఈరోజు హైదరాబా దులోని అలీ కేఫ్ వద్ద ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద ఘనంగా సంబరాలు నిర్వహించారు ఇంధులో ముఖ్యఅతిథిగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముందుగా శ్రీనివాస్ గౌడ్ ఇతర బీసీ సంఘాల నేతలు కలిసి జ్యోతిబాపూలే విగ్రహానికి పాలాభిషేకం చేశారు అనంతరం విగ్రహం వద్ద వివిధ వృత్తులు చేసు కునే బీసీ కులాల వారికి మిఠాయిల పంపిణీ చేశారు. అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ కులాల లెక్కలు తీయాలని బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించాలని తాము ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామని బీసీల పోరాటాలను బీసీల ఆకాంక్షలను గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో సమగ్ర కులగనణ చేపడుతామని తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమగ్ర కులగనల తోనే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు.

# ఐటి కోచింగ్ సెంటర్లు బలవన్మరణాలకు కారణం అవుతున్నాయా?.!

"అమ్మ నాన్న నాకు ఐఐటి జెఈఈ పరీక్షలు రాయడం ఇష్టం లేదు. నేను ఓడి పోయాను. నేను ఒక వైఫల్యం చెందిన కూతురును. నన్ను క్షమించండి. నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. నన్ను క్షమించండి. నాకు మరో మార్గం కనిపించడం లేదు" అంటూ 18 ఏళ్ల విద్యార్థిని జనవరి 2024లో కోటా, రాజస్థాన్ ఐఐటి కోచింగ్ సెంటర్ నుంచి ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకున్న వార్త మనందరినీ కలిచి వేస్తున్నది. మన పిల్లలు మనం కోరుకున్న చదువులు చదవాలా, వారు ఇష్టపడుతున్న కోర్సులు చేయాలా అనే ప్రశ్నకు సమాధానం తల్లితండ్రులే ఇవ్వాలి. మన పిల్లలు ఉన్నత చదువులు చదివి ఆకర్షణీయ ఉద్యోగాల్లో స్థిరపడాలనే కోరిక ఉండడం సహజం. ఈ క్రమంలో పిల్లల ఇష్టాయిష్టాలు తెలుసుకోవడం అవసరం లేదా ?

## ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులకు గిరాకీ:

నేటి డిజిటల్ యుగంలో ఉన్నత చదువులు అంటే ఇంజనీరింగ్, మెడిసిన్ మాత్రమే అనుకుంటున్నాం. ఇంజనీరింగ్ చేయాలంటే ఐఐటీ/ఎన్ఐటీ/బిట్స్ పిలానీ లాంటి సంస్థలు గుర్తుకు వస్తున్నాయి. మెడిసిన్ అంటే అత్యున్నత ఏఐఐఎంఎస్/ఉస్మానియా లాంటి మెడికల్ కాలేజీలు మాత్రమే అనుకుంటున్నాం. దేశంలోనే 24 ఐఐటీల్లో ఉన్న 17,385 సీట్లు, 7,746 ఎన్ఐటీ సీట్లకు 9.3 లక్షల మంది ప్రవేశ పరీక్షకు దరాఖాస్తు చేసుకొని రాస్తున్నారు. ప్రతి ఒక్క ఐఐటీ సీటుకు సగటున 50 మందికి పైగా విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఓపెన్ కేటగిరీలో ఉన్న విద్యార్థులకు పోటీ అనేక రెట్లు ఎక్కువగా ఉంటున్నది. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అపరిమితమైన పోటీ/ఒత్తిడికి లోనవుతున్నారు. తల్లితండ్రులను కాదనలేక, ఇష్టం లేని చదువులు చదవలేక, సీటు పొందగల సామర్థ్యం కొరవడి మానసికంగా నలిగిపోతూ, చివరకు ఆత్మహత్యల బారిన పడుతున్నారు. నేడు 15 - 20 ఏండ్ల లోపు యువత మరణాలకు మూడవ ప్రధాన కారణంగా ఆత్మహత్యలు నిలుస్తున్నాయి.

## కోర్సుల ఎంపికలో యువతకు స్వేచ్ఛను ఇస్తున్నామా !

మన పిల్లల భవిష్యత్తు జీవితం వడ్డించినా విస్తరణ కాదు. పోరాడడం అనివార్యం. గెలవడం అవసరం. మన భవిష్యత్తును మనమే తీర్చిదిద్దుకోవడానికి ఇష్టంగా కష్టపడడం, స్మార్ట్‌గా ఆలోచించడం తప్పనిసరి. పిల్లలు ఇష్టపడే కోర్సులను ఎంపిక చేసుకోవడానికి వారికి స్వేచ్ఛను ఇస్తున్నామా ? బలవంతంగా మన ఐఐటి ఇంజనీరింగ్/మెడికల్ కోరికలను వారిపై రుద్దుతున్నామా ? ఉజ్వల భవిష్యత్తును ఇవ్వగల కోర్సుల్లో చేరడమా, పిల్లలు ఇష్టపడే కోర్సులు చేయడమా అనే సందిగ్ధంలో నేటి అమ్మనాన్నలు, బంధువులు, పిల్లలు నలిగి పోవడం చూస్తున్నాం. అత్యున్నత స్థాయి ప్రమాణాలు కలిగిన ఐఐటీ పరీక్షల్లో నెగ్గడానికి పిల్లలకు అద్వితీయమైన మేధో మధనం జరగాలి. నేడు మన చుట్టు అపరిమితమైన పోటీతత్వం ఉంటున్నది. ఈ పోటీ వలయంలో విద్యార్థి భవిష్యత్తు నిర్ణేతలుగా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, కోచింగ్ సెంటర్లు, పాఠశాలలు వ్యవహరిస్తున్నాయి. మన పిల్లల అభిప్రాయాలను అడిగే నాథుడే కరువైనాడు. కోచింగ్ సెంటర్లను నియంత్రించే నిర్థిష్టమైన ప్రభుత్వ యంత్రాంగాలు లేవు. డిమాండ్‌ను బట్టి కోచించ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నాయి.

## కోటా రాజస్థాన్ కోచించ్ కారాగారాలు:

ఐఐటీ జెఈఈ ప్రవేశ పరీక్షలకు పేరొందిన కోటా రాజస్థాన్ కేంద్రం నేడు అనేక కోచించ్ కారాగారాల నెలవులుగా వెలుస్తున్నాయి. విద్యార్థుల విషయ పరిజ్ఞానం పరీక్షించి చేర్చుకునే విధానం కరువైంది. సాధారణ విద్యా ప్రమాణాలు కలిగిన విద్యార్థులు కూడా ఐఐటీ సీటు కోసం కోటా సెంటర్లను ఆశ్రయించడం, వైఫల్యం చెందడం, మానసిక ఒత్తిడి ఊబిలో కూరుకు పోవడం, ఆత్మహత్య వరకు ఆలోచించడం సర్వసాధారణం అయ్యింది. విద్యార్థిలో క్రిటికల్ థింకింగ్, సృజనశీల ఆలోచనలు ఉన్నట్లు గమనిస్తున్నామా ? అపరిమిత పోటీని తట్టుకొని గెలవడానికి కావలసిన నైపుణ్య ఆయుధాలను అందిస్తున్నామా ? పిల్లల శక్తిసామర్థ్యాలను తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నామా ?

మూస పద్దతి పాఠ్యాంశాల బోధనలు, జ్ఞాపకశక్తిని పరీక్షించే ప్రశ్నాపత్రాలు, బట్టి పట్టి ర్యాంకులు సాధించే దుస్థితులు, సమాచార వితరణ ఆధార బోధనలు లాంటివి పాటిస్తున్న విద్యాసంస్థలు డిజిటల్ యుగపు క్రియేటివ్, క్రిటికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్, అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయవలసిన అవసరాన్ని గుర్తించవలసిన సమయం ఆసన్నమైంది.

ఆత్మహత్యలు వద్దు, ఆసక్తిగల కోర్సులే ముద్దు అని తెలుసుకొని ఉన్నత విద్యలో రాణించి తమ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యాధికులు సూచిస్తున్నారు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి-జిల్లా కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 16:(నేటినిజం ప్రతినిధి): ఈనెల 28 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్, వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో ఇంటర్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ రమేష్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ అత్యంత జాగరూకతతో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, ఏ చిన్న పొరపాటు జరిగినా విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని అన్నారు.

పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రం లోకి చేరుకోవాలని,ఒక నిముషం ఆలస్యం అయితే పరీక్ష కేంద్రం లోకి అనుమతి లేదన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ పై సమీక్షిస్తూ, ఫిబ్రవరి 28 నుండి మార్చ్ 19 వరకు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు జరిగి పరిక్షలకు జిల్లాలో 13,173 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, ఇందులో మొదటి సంవత్సరంలో 6,507మంది విద్యార్థులు, రెండవ సంవత్సరంలో 6666 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని అన్నారు.. ఇందుకోసం 30 కేంద్రాలు ఏర్పాటు చేస్తూ ప్రతి కేంద్రంలో సి.సి.కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, 30 చీఫ్ సూపరింటెండెంట్లు. 30 శాఖాధికారులతో పాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, 4 సిట్టింగ్ స్క్వాడ్, 5 కస్టడీయన్ టీములు ఏర్పాటు చేశామని వీరు పరీక్షల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని అన్నారు. ప్రశ్న పత్రాల స్టోరేజికి 14 పాయింట్లు ఏర్పాటు చేశామని తెలిపారు.పరీక్షలు పకడ్బందీగా నిర్వహించుటకు పోలీస్ శాఖ ప్రశ్న ప్రత్రాల స్టోరేజి, తరలింపు లో, పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, పరీక్షా సమయంలో జీరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరయ్యేలా ఆర్టీసీ అధికారులు బస్సులను నడపాలని, వైద్య అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో మెడికల్ పాయింట్ ఏర్పాటు చేయాలని, విద్యుత్ లో అంతరాయం నీ కలుగకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. పోస్టల్ శాఖ వారు జవాబు పత్రాలను సరిగా రిసీవ్ చేసుకోనీ స్పీడ్ పోస్ట్ ద్వారా పంపాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో మంచినీరు, ఫాన్స్, టాయిలెట్స్ ఏర్పాట్లు సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ గాడ్జెస్ వంటివి తీసుకురాకుండా తనిఖీ చేసి సమీపంలోని కలెక్టింగ్ పాయింట్ లో డిపాజిట్ చేయాలనీ, తమ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని డీఈఓ, ఇంటర్మీడియట్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సత్యనారాయణ, డీఈఓ రాధాకిషన్, శశిధర్ ,అశోక్ ,పొలిసు, పోస్టల్, ఆర్.టి.సి. విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం మెదక్ ద్వారా జారీ చేయనైనది.

# గతం కంటే ఎక్కువ స్థానాలలో గెలుస్తాం - మంత్రి పెద్దిరెడ్డి



అమరావతి, ఫిబ్రవరి 16:వచ్చే ఎన్నికల్లో 151 కంటే ఎక్కువ స్థానాలు గెలుస్తాం అంటూ ధీమా వ్యక్తం చేశారు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.. రేపు రాప్తాడులో జరగబోయే వైసీపీ సిద్ధం సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం అనంతపురం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాప్తాడు సిద్ధం సభ అనంతరం వైసీపీ ఎన్నికల ఊపు అందుకుంటుందన్నారు.

అందుకే ప్రతిష్టాత్మంగా తీసుకుని సభ విజయవంతానికి కృషి చేస్తున్నాం అన్నారు. రాబోయే ఎన్నికలకు పూర్తిగా వైసీపీ శ్రేణులు సన్నద్ధం అవుతున్నాయని, . ఈ సభతో రాష్ట్రంలో మూడు సిద్ధం సభలు పూర్తి అవుతాయని అన్నారు. త్వరలో పల్నాడులో మరో సభ ఉంటుందన్నారు. గత ఎన్నికల కంటే అత్యధిక స్థానాలు సాధించేందుకు ఈ సభ ఊతం ఇస్తుందన్నారు . రాష్ట్రంలో అతి పెద్ద సభగా రాప్తాడు సిద్దం సభ నిలుస్తుందన్నారు.

# తలాతోక లేని కులగణన తీర్మానం

## -కులగణన తీర్మానం కేవలం కంటితుడుపు చర్య

## - తీవ్రంగా నిరసిస్తున్నాం: ఎమ్మెల్సీ కవిత

ఃహైదరాబాద్ ఫిబ్రవరి 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ అసెంబ్లీలో చేసిన కులగణన తీర్మానంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. కులగణన తీర్మానం కేవలం కంటితుడుపు చర్య అని ఆమె కొట్టిపారేశారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. కులగణనకు చట్టబద్ధత కల్పించాలని, తక్షణమే ఆ చట్టాన్ని అసెంబ్లీలో ఆమోదించాలని ఆమె డిమాండ్ చేశారు. బీసీ సబ్ ప్లాన్‌కు కూడా చట్టబద్ధత కల్పించాలన్నారు. శనివారం ఉదయం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కవిత మాట్లాడారు. కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో, ఎలా చేస్తారో ప్రభుత్వం చెప్పలేదని అన్నారు. స్పష్టత లేని కులగణన తీర్మానం బీసీలను మభ్యపెట్టే చర్య అని విమర్శించారు. తలాతోక లేని తీర్మానాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని చెప్పారు. బీసీలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. బీహార్, కర్ణాటక రాష్ట్రాల్లో కులగణన చేపట్టే ముందు చట్టం చేశారని చెప్పారు.కాంగ్రెస్ పార్టీది బీసీ వ్యతిరేక చరిత్ర అని ఆరోపించారు. మండల్ కమిషన్ సమయంలో పార్లమెంటులో రాజీవ్ గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని గుర్తుచేశారు. 2011లో యూపీఏ హయాంలో చేసిన కులగణన నివేదికను ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు బీసీలు ఇప్పుడే ఎందుకు గుర్తొచ్చారో రాహుల్ గాంధీ చెప్పాలన్నారు. రాహుల్ గాంధీ బాధ్యతలేని మాటలు మానుకోవాలని హితవుపలికారు.

# మహబూబ్ నగర్ జిల్లాలలో 21 శునకాల కాల్చివేత

## ..నిందితుల కోసం పోలీసుల వేట

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 16:మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ గ్రామంలో 21 వీధికుక్కలను కాల్చి చంపడం కలకలం రేపింది. ఈ ఘటనపై తీవ్ర విమర్శలు రావడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆయుధాల చట్టం, జంతువులపై క్రూరత్వం చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే, ఇప్పటి వరకు నిందితులను గుర్తించలేదు. మహబూబ్‌నగర్ జిల్లాలోని పొన్నకల్ గ్రామంలో జరిగిందీ ఘటన.

వివరాలలోకి వెళితే ఆయుధాలు చేతబట్టిన గుర్తు తెలియని దుండగులు ఈ మారణహోమానికి తెగబడ్డారు. వారి కాల్పుల్లో మరికొన్ని శునకాలకు గాయాలయ్యాయి.

కాల్పుల్లో మరణించిన శునకాలకు పశుసంరక్షణశాఖ పోస్టుమార్టం నిర్వహించింది. దీనిపై అడ్డకల్ ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ.. శునకాలకు తొలుత విషం పెట్టి ఆ తర్వాత అతి సమీపం నుంచి కాల్చి చంపి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. దుండగులు ఉపయోగించినవి నాటు తుపాకులు అయి ఉంటాయని పేర్కొన్నారు.

ఘటన జరిగిన ప్రాంతంలో సీసీటీవీ కెమెరాలు లేకపోవడంతో ఇన్వెస్టిగేషన్ ముందుకు సాగడం లేదన్నారు. .

శునకాల కాల్చివేతకు గల కారణంపై ఆరా తీస్తున్నారు. అయితే, ఇదే ఘటనలో చనిపోయిన రెండు శునకాల శరీరాలపై ఎలాంటి తుపాకి గాయాలు లేకపోవడంతో అవి విష ప్రయోగం వల్ల చనిపోయి ఉంటాయని అనుమానిస్తున్నారు.

# అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు 2900 కోట్ల పెనాల్టీ

## -తప్పుడు ఆర్థిక పత్రాలతో బ్యాంకులను మోసం చేసిన కేసులో న్యూయార్క్ కోర్ట్ తీర్పు

న్యూయార్క్ ఫిబ్రవరి 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కు .. న్యూయార్క్ జడ్జి భారీ జరిమానా విధించారు. సుమారు 355 మిలియన్ల డాలర్లు అంటే దాదాపు 2900 కోట్ల పెనాల్టీ ఆయన చెల్లించాల్సి ఉంటుంది. తప్పుడు ఆర్థిక పత్రాలతో బ్యాంకులను మోసం చేసిన కేసులో న్యూయార్క్ జడ్జి ఈ తీర్పును వెలువరిచారు. న్యూయార్క్ కార్పొరేషన్‌కు ఆఫీసర్‌గా కానీ డైరెక్టర్‌గా మూడేళ్ల పాటు ఉండకూడదని కోర్టు తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. తన ప్రాపర్టీల విషయంలో ట్రంప్ అబద్ధాలు చెప్పినట్లు ఆరోపణలు ఉన్నాయి. మూడేళ్ల పాటు ట్రంప్ మళ్లీ బ్యాంకుల నుంచి రుణం తీసుకోరాదు అని జడ్జి ఆర్డర్ ఎంగోరణ్ ఆదేశించారు. అయితే ఈ తీర్పు పట్ల అప్పీల్ చేయనున్నట్లు ట్రంప్ తెలిపారు.

# జగన్ అనంత సభకు అంతా సిద్ధం

## - భారీగా జనసమీకరణలో నేతలు

అమరావతి, ఫిబ్రవరి 16:ఉమ్మడి అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న సిద్ధం సభకు సర్వ సన్నద్ధమైంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో రాయల సీమ జిల్లాల నుంచి పది లక్షల మందికి కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. పూర్వపు కడప, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి జనం వస్తుండడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

సభాస్థలికి మధ్యాహ్నం ఒంటిగంటకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో నుంచి 200 బస్సులను ఏర్పాటు చేశారు. సభకు వస్తున్న జనం కోసం బిర్యాని ప్యాకెట్లు, నీళ్ల బాటిళ్లు, టోపీలు ఇతరత్రా సదుపాయాలు కల్పించారు. ప్రతి తమకు అప్పగించిన బాధ్యతను ప్రతీ ఎమ్మెల్యే దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు. సీఎం సభ ప్రాంతం రాప్తాడు నియోజకవర్గ మండల కేంద్రం కావడంతో పాటు ఆటోనగర్ సమీపంలో ఏర్పాటు చేశారు. బెంగళూరు హైదరాబాద్ 44వ నెంబర్ జాతీయ రహదారి చెన్నై బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారులు ఈ ప్రాంతం నుంచి వెళ్తాయి. దీంతో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

భారీ గూడ్స్ వాహనాలు మినహా మిగితా అన్ని రకాల వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు, అత్యవసర వాహనాలు యథావిధిగానే అనంతపురం మీదుగా హైవే-44 పై వెళవచ్చని ఎస్పి అన్బురాజన్ ప్రకటించారు. ఈ ఆంక్షలు కేవలం భారీ గూడ్స్ వాహనాలకు మాత్రమే వర్తిస్తాయన్నారు. మిగితా అన్ని రకాల వాహనాలు, అత్యవసర వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు యథావిధిగానే అనంతపురం మీదుగానే హైవే-44 పై వెళ్లవచ్చున్నారు. ప్రజలు, వాహనచోదకులు అసౌకర్యానికి గురికాకుండా ఆంక్షలు సవరించామని పోలీసులతో సహకరించాలని ఆయన తెలియజేశారు.

చెన్నై, కదిరి వైపు నుండీ వయా ఫంగల్ రోడ్డు మీదుగా జాతీయ రహదారి-44 పై హైదరాబాద్ వెళ్లాల్సిన వాహనాలు బత్తలపల్లి వద్ద మళ్లించారు. బత్తలపల్లి నుండి నార్పల, బుక్కరాయసముద్రం, ఎన్టీఆర్ మార్గ్, గుత్తిరోడ్డు, తడకలేరు, సోములదొడ్డి వద్ద జాతీయ రహదారి-44 మీదుగా వెళ్లాలి. హైదరా బాద్ నుండీ వయా అనంతపురం మీదుగా కదిరి, చెన్నై వైపు వెళ్లాల్సిన వాహనాలు సోములదొడ్డి వద్ద డైవర్షన్ చేశారు. సోములదొడ్డి నుండి తడకలేరు, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, బుక్కరాయ సముద్రం, నార్పల, బత్తలపల్లిల మీదుగా వెళ్లాలి . వాహనాల రాకపోకల మళ్లింపు ప్రారంభపు ప్రదేశాలలో "ట్రాఫిక్ డైవర్షన్" వివరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. వాహనాల డ్రైవర్లు గమనించి ఫ్లెక్సీలలో సూచించిన ప్రకారం ఆయా రహదారులపై వెళ్లాలి.

# తెలంగాణ భవన్‌లో ఘనంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు

## -వెయ్యి మంది ఆటో డ్రైవర్‌లకు రూ. లక్ష చొప్పున ప్రమాద బీమా పత్రాలను అందజేత




హైదరాబాద్ ఫిబ్రవరి 17 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెయ్యి మంది ఆటో డ్రైవర్‌లకు రూ. లక్ష చొప్పున ప్రమాద బీమా పత్రాలను కేటీఆర్ అందజేశారు. వికలాంగులకు వీల్ చైర్‌లను పంపిణీ చేశారు. 70 కిలోల కేక్ కటింగ్ చేశారు.కేసీఆర్ జన్మదిన వేడుకలకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. కేసీఆర్ రాజకీయ, ఉద్యమ నేపథ్యంతో రూపొందించిన ప్రత్యేక డాక్యుమెంటరీని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు.

# వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం -కలెక్టరు రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 16:(నేటినిజం ప్రతినిధి): పదవతరగతి లో 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యం గా ఉపాధ్యాయులు , తల్లితండ్రులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు.

హవేలీ ఘనపూర్ మండల కేంద్రము లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా , జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు, 100% ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రులు ఇంటి వద్ద తీసుకోవాల్సిన చర్యలు మరియు విద్యార్థుల ప్రిపరేషన్ గురించి సూచనలు చేయడం జరిగింది. మంచిగా కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు అని తెలియజేశారు. విద్యార్థులను టీవీ మాధ్యమాలకు ఫోన్లకు దూరంగా ఉంచాలని వారు సరిగ్గా చదువుకున్నారా లేదా అని పరిశీలించాలని నిరంతరం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండాలని తల్లిదండ్రులకు సూచించడం జరిగింది. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలని ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలను మంచి ఫలితాలు సాధించాలని, విద్యార్థుల ప్రిపరేషన్-ప్రణాళిక గురించి వారితో ముచ్చటించడం జరిగింది. విద్యార్థులు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను గ్రాండ్ టెస్ట్ లను సద్వినియోగ పరుచుకోవాలని, విద్యార్థులను పాఠశాలకు గైర్హాజరు కాకుండా చూడాలని ,చదువు తప్ప వేరే ఇతర పనులు విద్యార్థులకు చెప్పకుండా ఉండాలని తెలియజేశారు. సిలబస్,విద్యార్థుల హాజరు, ం.ః.అ.ఆ గ్రూపు గా విభజించిన విద్యార్థుల యొక్క స్థాయి నీ తెలుసుకున్నారు. విద్యార్థులు బాగా కష్ట పడి చదివి , ఉపాధ్యాయులకు తల్లితండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం హవేలీ ఘనపూర్ మండల కేంద్రం లో ఉన్న ప్రాథమిక పాఠశాలను,అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి,రికార్డ్ లు పరిశీలించారు. విద్యార్థులను ఆహారం ఎలా పెడుతున్నారు? రుచిగా ఉంటుందా?అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం హవేలీ ఘనపూర్ తహశీల్దార్ నారాయణ , కరుణాకర్ నీలకంఠం, సుదర్శనమూర్తి అధికారులు, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు ,విద్యార్థులు, విద్యార్థుల తల్లదండ్రులు ,తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పెట్రో ఫిల్లింగ్ స్టేషన్‌కు మూడు అవార్డులు

వరంగల్, ఫిబ్రవరి 16:తెలంగాణ రాష్ట్ర డీలర్స్ అవార్డ్స్ 2023-24 సంవత్సరానికి వరంగల్ కమిషనరేట్ పోలీస్ విభాగం అధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ పోలీస్ వెల్ఫేర్ సొసైటీ వరంగల్ కాకతీయ ఫిల్లింగ్ స్టేషన్ మూడు అవార్డులను కైవసం చేసుకొని చాంఫియన్ ఆఫ్ చాంఫియన్స్‌గా నిలిచింది. ప్రతి ఏడాది భారత్ పెట్రోలియం సంస్థ డీలర్స్‌కు ప్రకటించే అవార్డుల్లో భాగంగా ఈ ఏడాది వాహనదారులకు అందించే పెట్రోలు, డిజిల్ నాణ్యత, తూనికలు, పెట్రో ఫిల్లింగ్ స్టేషన్ నిర్వహణలో వరంగల్ టెరిటోరియల్ లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పెట్రో ఫిల్లింగ్ స్టేషన్ ఉత్తమంగా నిలవడంతో భారత్ పెట్రోలియం సంస్థ పోలీస్ పెట్రో ఫిల్లింగ్ స్టేషన్‌కు



మూడు అవార్డులతో పాటు చాంఫియన్ ఆఫ్ చాంఫియన్స్ షీల్డ్‌ను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పెట్రో ఫిల్లింగ్ స్టేషన్ ఇంచార్జ్ సురేంద్రతో పాటు, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ ప్రభాకర్ రెడ్డిలకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేసారు. అనంతరం పెట్రో ఫిల్లింగ్ స్టేషన్ అధికారులు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ అభినందనలు తెలియజేస్తూ నాణ్యమైన పెట్రో ఉత్పత్తులను అందజేసి వాహనదారులు అభిమానాన్ని సాధించడంతో పాటు నిరుద్యోగ యువతకు ఈ పెట్రో ఫిల్లింగ్ స్టేషన్ ద్వారా ఉపాధి కల్పించడం చాలా సంతోషంగా వుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# జల సంబంధ సమస్యలను పరిష్కరించడం కోసం హరియాణా ప్రభుత్వం ప్రశంసనీయమైన కార్యాన్ని పూర్తి చేసింది

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:హరియాణా లోని రేవాడీ లో 9,750 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన అనేక అభివృద్ధి ప్రాజెక్టుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర వోదీ ఈ రోజు న ప్రారంభోత్సవం, దేశ ప్రజల కు అంకితం ఇవ్వడం లతో పాటు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు లు పట్టణ ప్రాంతాల లో రవాణా, ఆరోగ్యం, రైలు మార్గాలు మరియు పర్యటన ల వంటి అనేక ముఖ్యమైన రంగాల కు చెందినవి. ఈ సందర్భం లో ఏర్పాటు చేసిన కొన్ని ఎగ్జిబిషన్ లను కూడా శ్రీ నరేంద్ర మోదీ కలియదిరిగి పరిశీలించారు.

సభ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ధైర్యవంతుల పురిటిగడ్డ రేవాడీ కి ప్రశంస ను వ్యక్తం చేస్తూ, ఈ ప్రాంతం లో తన పట్ల ప్రజలు చూపిన ఆప్యాయత ను గుర్తు కు తెచ్చారు. 2013 వ సంవత్సరం లో ప్రధాని అభ్యర్థి గా తన తొలి కార్యక్రమం రేవాడీ లోనే జరిగిన సంగతి ని ఆయన గుర్తు కు తెచ్చుకొంటూ, ప్రజలు అందించిన శుభాకాంక్షల ను స్మరించుకొన్నారు. ప్రజల ఆశీస్సులే తనకు ఒక పెద్ద ఆస్తి అని ఆయన అన్నారు. ప్రపంచం లో నూతన శిఖరాల కు భారతదేశం చేరుకొంటోంది అంటే దానికి సంబంధించిన ఖ్యాతి ప్రజల దీవెనలదే అన్నారు. యుఎఇ ని మరియు కతర్ ను ప్రధాన మంత్రి తాను సందర్శించిన విషయమై మాట్లాడుతూ, ప్రపంచ రంగస్థలం లో భారతదేశాని కి లభిస్తున్నటువంటి గౌరవం మరియు సద్భావన ల ఖ్యాతి భారతదేశ ప్రజలకే దక్కుతుంది అని స్పష్టం చేశారు. అదే విధం గా జి-20, చంద్రయాన్ మరియు భారతదేశ ఆర్థిక వ్యవస్థ పదకొండో స్థానం నుండి అయిదో స్థానాని కి ఎగబాకడం.. ఇవన్నీ ప్రజల సమర్థన చలవే నన్నారు. రాబోయే సంవత్సరాల లో భారతదేశాన్ని ప్రపంచం లో మూడో అతి పెద్దదైనటువంటి ఆర్థిక వ్యవస్థ గా మలచడానికి ప్రజలు వారి యొక్క ఆశీస్సుల ను అందించాలి అని ఆయన కోరారు.

భారతదేశం వికసిత్ భారత్ గా రూపొందాలి అంటే హరియాణా అభివృద్ధి అవసరం అని ప్రధాన మంత్రి అన్నారు. రహదారులు మరియు రైల్ వే నెట్ వర్క్ ల ఆధునికీకరణ తో పాటు, హరియాణా అభివృద్ధి కి గాను అన్ని సౌకర్యాలు లభించేటటువంటి ఆసుపత్రులు నిర్మించేందుకు పది వేల కోట్ల రూపాయల ఖర్చు తో అనేక అభివృద్ధి పథకాల కు ఈ రోజు న శంకుస్థాపన చేయడం , దేశ ప్రజల కు ఆ ప్రాజెక్టుల ను అంకితం ఇవ్వడం గురించి ఆయన ప్రస్తావించారు. ఆయా అభివృద్ధి పథకాల ను ప్రధాన మంత్రి ఒక్కటొక్కటిగా పేర్కొంటూ, వాటి లో ఎఐఐఎమ్ఎస్ రేవాడీ, గురుగ్రామ్ మెట్రో , అనేక రైలు మార్గాలు మరియు క్రొత్త రైళ్ళు, ఇంకా 'అనుభవ్ కేంద్ర' జ్యోతిసర్ లు ఉన్నాయి అన్నారు. అనుభవ్ కేంద్ర జ్యోతిసర్ ను గురించి ప్రధాన మంత్రి చెప్తూ, భగవద్ గీత లో శ్రీ కృష్ణ భగవానుడు చేసిన బోధల ను ప్రపంచాని కి ఆ కేంద్రం పరిచయం చేయడం తో పాటు గా భారతదేశం సంస్కృతి లో వైభవోపేతమైన గడ్డ అయినటువంటి హరియాణా తోడ్పాటుల ను కూడా ప్రముఖం గా ప్రచారం లోకి తీసుకు వస్తుంది అన్నారు. ఈ రోజు న చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టుల కు గాను హరియాణా ప్రజల కు ఆయన అభినందనల ను తెలియ జేశారు.

'మోదీ గ్యారంటీ' ('మోదీ హామీ') ని గురించి దేశ స్థాయి లోను, ప్రపంచం స్థాయి లోను సందడి నెలకొన్న సంగతి ని గురించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర వోదీ మాట్లాడుతూ, 'మోదీ యొక్క హామీ' కి తొలి సాక్షి గా రేవాడీ ఉందన్నారు. దేశం ప్రతిష్ఠ ను గురించి, అయోధ్య ధామ్ లో శ్రీ రామ్ దేవాలయాన్ని గురించి తాను ఇక్కడ ఇచ్చిన హామీలను గురించి ఆయన మరొక మారు గుర్తు కు తెస్తూ, ఆ హామీ లు వాస్తవ రూపాన్ని దాల్చాయి అన్నారు. అదే విధం గా, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ కి అనుగుణం గా 370 వ అధికరణాన్ని రద్దు చేయడం జరిగింది అన్నారు. ప్రస్తుతం జమ్ము, కశ్మీర్ లో మహిళలు, వెనుబడిన వర్గాల వారు, దళితులు, ఆదివాసీలు వారి వారి హక్కుల ను వినియోగించుకొంటున్నారు అని ఆయన అన్నారు.

మాజీ సైనికోద్యోగుల కు 'ఒక ర్యాంకు- ఒక పెన్శన్' (ఒఆర్ఒపి) తాలూకు హామీ ని నెరవేరుస్తానంటూ రేవాడీ లో హామీ ని ఇచ్చిన విషయాన్ని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ఇంతవరకు దాదాపు గా ఒక లక్ష కోట్ల రూపాయల ను అందజేయడమైందని, మరి ఈ ప్రయోజనాల ను హరియాణా కు చెందిన ఎంతో మంది మాజీ సైనికోద్యోగులు అందుకొన్నారన్నారు. రేవాడీ లో ఇంతవరకు 600 కోట్ల రూపాయల కు పైచిలుకు సొమ్మును ఒఆర్ఒపి యొక్క లబ్ధిదారులు అందుకొన్నట్లు ప్రధాన మంత్రి తెలిపారు. మునుపటి ప్రభుత్వం ఒఆర్ఒపి కి 500 కోట్ల రూపాయల బడ్జెటు ను కేటాయించిందని, అది ఒక్క రేవాడీ లోనే మాజీ సైనికులు అందుకొన్న మొత్తం కంటే తక్కువ గా ఉంది అని కూడా ఆయన వివరించారు.

రేవాడీ లో ఎఐఐఎమ్ఎస్ ను ఏర్పాటు చేయడం జరుగుతుంది అని ఇచ్చిన హామీ ని కూడా ను ఈ రోజు న శంకుస్థాపన చేయడం తో నెరవేర్చడం జరిగింది. రేవాడీ ఎఐఐఎమ్ఎస్ ను ప్రారంభించేది కూడా తానే అంటూ ప్రధాన మంత్రి బరోసా ను ఇచ్చారు. దీనితో మెరుగైన వైద్య చికిత్స కు అవకాశం కలుగుతుంది అని, స్థానిక పౌరుల కు వైద్యుడు గా ఎదిగేందుకు అవకాశం లభిస్తుంది అని ఆయన అన్నారు. రేవాడీ ఎఐఐఎమ్ఎస్ దేశం లో 2 2వ ఎఐఐఎమ్ఎస్ అని ప్రధాన మంత్రి తెలిపారు. గడచిన పది సంవత్సరాల లో క్రొత్త గా 15 ఎఐఐఎమ్ఎస్ లను మంజూరు చేయడం జరిగింది. 300కు పైగా వైద్య కళాశాల లు గడచిన 10 సంవత్సరాల లో ఏర్పాటు అయ్యాయి. హరియాణా లో కూడాను, ప్రతి ఒక్క జిల్లా లో కనీసం ఒక వైద్య కళాశాల ఏర్పడేటట్టు చూడడం కోసం తగిన పనులు సాగుతున్నాయి.

ప్రస్తుత ప్రభుత్వం మరియు గతించిన కాలపు ప్రభుత్వాల యొక్క సుపరిపాలన మరియు దుష్పరిపాలన ల మధ్య ప్రధాన మంత్రి పోలిక ను తీసుకు వచ్చారు; అదే కోవ లో గడచిన పదేళ్ళ లో హరియాణా లో డబల్ ఇంజన్ ప్రభుత్వం పనిచేస్తూ ఉండడాన్ని ఆయన ప్రముఖం గా ప్రస్తావించారు. పేద ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విధానాల అమలు విషయాని కి వస్తే, ఈ రాష్ట్రం అగ్ర స్థానం లో నిలబడుతోంది అని ఆయన వెల్లడించారు. వ్యవసాయ రంగం లో హరియాణా యొక్క వృద్ధి ని గురించి మరియు రాష్ట్రం లో పరిశ్రమల విస్తరణ ను గురించి ఆయన వివరించారు. రహదారులు, రైలు మార్గాలు లేదా మెట్రో సర్వీసుల పరంగా చూస్తే దశాబ్దాల తరబడి వెనుకపట్టునే ఉండిపోయిన దక్షిణ హరియాణా ప్రస్తుతం శరవేగం గా అభివృద్ధి చెందుతోందని ఆయన ప్రముఖం గా ప్రకటించారు. దిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వే లో భాగం అయిన దిల్లీ- దౌసా-లాల్‌సోట్ సెక్షన్ యొక్క ఒకటో దశ ఇప్పటికే ప్రారంభం అయిందని, అదీ గాక భారతదేశం లోనే అతి పొడవైన ఎక్స్‌ప్రెస్ వే అయిన దిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్ వే హరియాణా లోని గురుగ్రామ్, పల్‌వల్, ఇంకా నూహు జిల్లాల గుండా సాగుతోంది అని ప్రధాన మంత్రి తెలిపారు.

2014కి ముందు నగటున రూ.300 కోట్లుగా ఉన్న హర్యానా వార్షిక రైల్వే బడ్జెట్ ఇప్పుడు గత పదేళ్లలో రూ.3,000 కోట్లకు పెరిగిందని ప్రధాని మోదీ వెల్లడించారు. రోహ్తక్-మెహమ్-హాంసీ, జింద్-సోనిపట్ కోసం కొత్త రైల్వే లైన్లు, అంబాలా కాంట్-దప్పర్ వంటి మార్గాలను రెట్టింపు చేయడం గురించి ఆయన ప్రస్తావించారు. లక్షలాది మందికి ప్రయోజనం చేకూర్చడంతో పాటు సులభతర జీవనం, సులభతర వ్యాపారాన్ని పెంచుతుందని చెప్పారు.

యువతకు ఉపాధిని కల్పిస్తున్న వందలాది బహుళజాతి కంపెనీలకు నిలయంగా ఉన్న ఈ రాష్ట్రంలో నీటి సంబంధిత సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయమని ప్రధాన మంత్రి అన్నారు.

భారతదేశంలో 35 శాతానికి పైగా కార్పెట్‌లను ఎగుమతి చేస్తూ, 20 శాతం వస్త్రాలను తయారు చేస్తున్న టెక్స్‌టైల్, దుస్తుల పరిశ్రమ విషయానికి వస్తే హర్యానా తనకంటూ గొప్ప పేరు తెచ్చుకుంటుందని ప్రధాని మోదీ అన్నారు. హర్యానా జౌళి పరిశ్రమను ముందుకు తీసుకెళ్తున్న చిన్న తరహా పరిశ్రమల గురించి ప్రస్తావిస్తూ, పానిపట్ చేనేత ఉత్పత్తులకు, ఫరీదాబాద్ వస్త్ర ఉత్పత్తికి, గురుగ్రామ్ రెడీమేడ్ వస్త్రాలకు, సోనిపట్ టెక్నికల్ టెక్స్‌టైల్స్‌కు, భివానీ నాన్-నేసిన-వస్త్రాలకు ప్రసిద్ధి చెందిందని ప్రధాన మంత్రి హైలైట్ చేశారు. గత 10 సంవత్సరాలలో ఎంఎస్ఎంఈలు, చిన్న తరహా పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల రూపాయల సహాయం గురించి ప్రధాన మంత్రి తెలియజేసారు, దీని ఫలితంగా పాత చిన్న తరహా పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు బలోపేతం అవుతున్నాయి. వేలాది కొత్త పరిశ్రమలు కూడా రాష్ట్రంలో స్థాపించారు.

రేవారిలోని విశ్వకర్మ ఇత్తడి పనితనం, హస్తకళల పనితనంపై వెలుగునిస్తూ, 18 వృత్తులకు సంబంధించిన అటువంటి సంప్రదాయ కళాకారుల కోసం పీఎం-విశ్వకర్మ యోజన ప్రారంభించడాన్ని ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది లబ్ధిదారులు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనలో భాగమవుతున్నారని, మన సాంప్రదాయ కళాకారులు, వారి కుటుంబాల జీవితాలను మార్చడానికి ప్రభుత్వం 13,000 కోట్ల రూపాయలు ఖర్చు చేయబోతోందని ఆయన తెలియజేశారు.

"మోదీ హామీ అనేది బ్యాంకులకు గ్యారెంటీ లేని వారి కోసం ఉద్దేశించబడింది", చిన్న రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని అందించడం, పేదలకు, దళితులకు తాకట్టు లేని రుణాల కోసం ముద్రా యోజనను అందించడం గురించి ప్రధాని ప్రస్తావించారు. అలాగే వెనుకబడిన, ఓబీసీ కమ్యూనిటీలు, వీధి వ్యాపారుల కోసం పీఎం స్వనిధి యోజన అమలు చేస్తున్నామని అన్నారు.

రాష్ట్రంలోని మహిళల సంక్షేమం గురించి మాట్లాడుతూ, హర్యానాకు చెందిన లక్షలాది మంది మహిళలతో సహా దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది మహిళలను స్వయం సహాయక సంఘాలతో అనుసంధానించడంతో పాటు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, నీటి సరఫరాను ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఈ స్వయం సహాయక సంఘాలకు లక్షల కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. లఖపతి దీదీ పథకాల గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, ఈ సంవత్సరం బడ్జెట్ కింద వారి సంఖ్యను 3 కోట్లకు పెంచే కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇప్పటి వరకు 1 కోటి మంది మహిళలు లఖపతి దీదీలుగా మారారని ప్రధాన మంత్రి తెలియజేశారు. నమో డ్రోన్ దీదీ పథకంపై కూడా ప్రధాన మంత్రి ప్రస్తావించారు, ఇందులో మహిళల సముదాయాలు సేద్యంలో ఉపయోగించుకునేలా నమోదు చేయడం ద్వారా వారికి అదనపు ఆదాయాన్ని కల్పించేందుకు శిక్షణ ఇస్తున్నారు.

''హర్యానా అద్భుతమైన అవకాశాల రాష్ట్రం", హర్యానా మొదటి సారి ఓటర్లకు ఉజ్వల భవిష్యత్తును ఉద్ఘాటిస్తూ ప్రధాన మంత్రి అన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వం హర్యానాను అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేస్తోందని, సాంకేతికత లేదా వస్త్ర, పర్యాటక లేదా వాణిజ్యం వంటి ప్రతి రంగంలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు కృషి చేస్తోందని ఆయన నొక్కి చెప్పారు. "హర్యానా పెట్టుబడులకు మంచి రాష్ట్రంగా ఎదుగుతోంది, పెట్టుబడులు పెరగడం అంటే కొత్త ఉద్యోగావకాశాలు పెరగడం" అని ప్రధాన మంత్రి చెబుతూ తన ప్రసంగాన్ని ముగించారు.

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, హర్యానా ముఖ్యమంత్రి శ్రీ మనోహర్ లాల్ ఖట్టర్ హర్యానా రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దాదాపు 5,450 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్న గురుగ్రామ్ మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. మొత్తం 28.5 కి.మీ పొడవుతో ఈ ప్రాజెక్ట్, మిలీనియం సిటీ సెంటర్‌ను ఉద్యోగ్ విహార్ ఫేజ్-5కి కలుపుతుంది. సైబర్ సిటీకి సమీపంలోని మౌల్సారి అవెన్యూ స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న రాపిడ్ మెట్రో రైల్ గురుగ్రామ్ మెట్రో నెట్‌వర్క్‌లో విలీనం అవుతుంది. ప్రపంచ స్థాయి పర్యావరణ అనుకూలమైన సామూహిక శీఘ్ర పట్టణ రవాణా వ్యవస్థలను పౌరులకు అందించాలనే ప్రధాన మంత్రి దార్శనికతను సాకారం చేయడంలో ఈ ప్రాజెక్ట్ ఒక ముఖ్యమైన అడుగు.

దేశవ్యాప్తంగా పబ్లిక్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేయాలనే ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా, హర్యానాలోని రేవారిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కి శంకుస్థాపన జరుగుతోంది. దాదాపు రూ. 1650 కోట్లతో ఎయిమ్స్ రేవారీని రేవారిలోని మజ్రా ముస్తిల్ భాల్హి గ్రామంలో 203 ఎకరాల స్థలంలో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో 720 పడకలతో హాస్పిటల్ కాంప్లెక్స్, 100 సీట్లతో మెడికల్ కాలేజీ, 60 సీట్లతో నర్సింగ్ కాలేజీ, 30 పడకలతో ఆయుష్ బ్లాక్, అధ్యాపకులు, సిబ్బందికి నివాస వసతి, యుజి మరియు పిజి విద్యార్థులకు హాస్టల్ వసతి, నైట్ షెల్టర్, గెస్ట్ హౌస్, ఆడిటోరియం వంటి సౌకర్యాలు ఉంటాయి. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన (పీఎంఎస్ఎస్వై) కింద స్థాపించిన ఎయిమ్స్ రేవారి హర్యానా ప్రజలకు సమగ్రమైన, నాణ్యమైన మరియు సంపూర్ణమైన తృతీయ సంరక్షణ ఆరోగ్య సేవలను అందిస్తుంది. కార్డియాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ఎండోక్రినాలజీ, బర్న్స్ & ప్లాస్టిక్ సర్జరీతో సహా 18 స్పెషాలిటీలు, 17 సూపర్ స్పెషాలిటీలలో పేషెంట్ కేర్ సేవలు ఈ సౌకర్యాలలో ఉన్నాయి. ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటెన్సివ్ కేర్ యూనిట్, ఎమర్జెన్సీ, ట్రామా యూనిట్, పదహారు మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్‌లు, డయాగ్నోస్టిక్ లాబొరేటరీలు, బ్లడ్ బ్యాంక్, ఫార్మసీ మొదలైన సదుపాయాలు కూడా ఉంటాయి. హర్యానాలో ఎయిమ్స్ స్థాపన సమగ్ర, నాణ్యత, సంపూర్ణమైన తృతీయ సంరక్షణ ఆరోగ్యాన్ని ప్రజలకు అందించడంలో ముఖ్యమైన మైలురాయి.

నూతనంగా నిర్మించిన అనుభవ కేంద్ర జ్యోతిసర్, కురుక్షేత్రాన్ని ప్రధాని ప్రారంభించారు. దాదాపు 240 కోట్ల వ్యయంతో ఈ ప్రయోగాత్మక మ్యూజియం నిర్మించారు. మ్యూజియం 17 ఎకరాలలో విస్తరించి ఉంది, 100,000 చదరపు అడుగుల ఇండోర్ స్థలాన్ని కలిగి ఉంది. ఇది మహాభారత ఇతిహాస కథనాన్ని, గీతా బోధనలను స్పష్టంగా జీవం పోస్తుంది. సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరచడానికి ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), 3డి లేజర్, ప్రొజెక్షన్ మ్యాపింగ్‌తో సహా అత్యాధునిక సాంకేతికతను కూడా మ్యూజియం ఉపయోగించుకుంటుంది. జ్యోతిసార్, కురుక్షేత్రం శ్రీకృష్ణుడు అర్జునుడికి భగవద్గీత శాశ్వతమైన జ్ఞానాన్ని అందించిన పవిత్ర స్థలం.

ప్రధాన మంత్రి బహుళ రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. రేవారి-కతువాస్ రైలు మార్గాన్ని (27.73 కి.మీ) డబ్లింగ్ చేయడంతో పాటు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు; కతువాస్-నార్నాల్ రైలు మార్గం (24.12 కి.మీ) రెట్టింపు; భివానీ-దోభ్ భాలి రైలు మార్గం రెట్టింపు (42.30 కి.మీ); మన్హేరు-బవానీ ఖేరా రైలు మార్గం (31.50 కి.మీ) రెట్టింపు. ఈ రైల్వే లైన్లను రెట్టింపు చేయడం వల్ల ఈ ప్రాంతంలో రైలు మౌలిక సదుపాయాలు పెంపొందుతాయి. ప్యాసింజర్, సరకు రైళ్లను సకాలంలో నడపడంలో సహాయపడుతుంది. రోహ్తక్, హిస్సార్ మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించే రోహ్తక్-మెహమ్-హన్సి రైలు మార్గాన్ని (68 కి.మీ) ప్రధాని జాతికి అంకితం చేశారు. రోహ్తక్-మెహమ్-హన్సి సెక్షన్‌లో రైలు సేవలను కూడా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఇది రోహ్తక్, హిసార్ ప్రాంతంలో రైలు కనెక్టివిటీని మెరుగుపరుస్తుంది, రైలు ప్రయాణీకులకు ప్రయోజనం చేకూరుస్తుంది.

# శ్రీశైలం గౌరీ సదన్ లో ఇద్దరు సూసైడ్

శ్రీశైలం,ఫిబ్రవరి 17:: శ్రీశైలం దేవస్థానం గౌరీ సదనం 137 రూమ్ లో ఓ మహిళ, పురుషుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగుచూసింది. మల్లేష్ అనే వ్యక్తి ఈనెల 13న రూమ్ తీసుకున్నట్లు ఎంట్రీ బుక్ లో నమోదు కాగా, ఉదయం పక్క రూము తీసుకున్న యాత్రికులకు దుర్గంధం రావడంతో అధికారులకు సమాచారం ఇచ్చారు.

దీంతో హుటాహుటిన క్లీనింగ్ సిబ్బందికి చెప్పగా.. రూము దగ్గరికి వెళ్లిన సిబ్బంది ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు.

ఉరివేసుకుని వేలాడుతున్న ఇద్దరిని చూసి ఉన్నతాధికారులకు, అలాగే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి సిఐ ప్రసాదరావు తమ సిబ్బందితో చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం సిఐ మాట్లాడుతూ? హైదరాబాద్ కు చెందిన మల్లేష్, సరిత ఆత్మహత్య చేసుకున్నారని సంఘటన స్థలంలో వెతుకగా మహిళకు సంబంధించిన ఆధార్ ఆధారంగా మహిళ పేరు సరితగా గుర్తించారు.

ఆమె వద్ద ఆధార్ తోపాటు కత్తి, శానిటైజర్ బాటిల్ దొరికాయి. అయితే మరణించిన మహిళ, పురుషుడు దంపతులా లేక ప్రేమ జంటనా అనే కోణంలో శ్రీశైలం సిఐ ప్రసాద్ రావు, పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేశారు.

# నవరత్నాలు కాదు.. నవమోసాలు - నారా లోకేష్



అమరావతి, ఫిబ్రవరి 17: సీఎం జగన్ మోహన్‌రెడ్డి పచ్చి అబద్దాల కోరు అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు నవరత్నాలు అన్నారు, అవి నవమోసాలుగా మారిపోయాయని, ఇంట్లో పిల్లలందరికీ అమ్మ ఒడి అని చెప్పి.. ఇప్పుడు ఒక బిడ్డకే అమ్మవడి అంటున్నారని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ తీవ్ర స్థాయిలో సీఎం జగన్ పై విరుచుకుపడ్డారు. శనివారం శృంగవరపుకోట శంఖారావం సభలో లోకేష్ మాట్లాడుతూ? రాబోయే రెండు నెలల్లో జగన్‌తో రాష్ట్ర ప్రజలు ఫుట్ బాల్ ఆడుకోబోతున్నారన్నారు.

కుర్చీ మడత పెడతామంటే అరగంట అంబటి తెగ బాధపడుతున్నారని, సీఎం జగన్ ఎక్కింది కుర్చీ కాదని, సింహాసనమంటూ అరగంట అంబటి చాలా బాధపడుతున్నారని, నిజమే రాష్ట్ర సింహాసనంపై శునకం కూర్చుంది. ఆ శునకాన్ని తరిమి తరిమి కొట్టాలంటే ..అంగీకరిస్తావా? అంబటి గుర్తుపెట్టుకో" అంటూ లోకేష్ కామెంట్స్ చేశారు. ప్రజల కన్నీళ్ల చూసిన చంద్రబాబు సూపర్ ఆరు పథకాలు పెట్టబోతున్నారని తెలిపారు.ఇక ఎన్నికల ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం చేసిన తరువాత మాత్రమే ఓట్లను అడుగుతానని చెప్పిన జగన్.. అధికారంలోకి వచ్చిన తరువాత ఊర్లు కాదుకదా వీధి వీధికి మద్యం ఏరులై పారుతుందని మండిపడ్డారు.

అలానే నలభై ఐదు ఏళ్ళ వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళకు పెన్షన్ ఇస్తాను అని చెప్పి జగన్ మాటతప్పారని ఆరోపించారు.బాబు ప్రకటించిన సూపర్ సిక్స్ అంటే జగన్ మాటలో కిచిడీ కాదని, రాయల సీమ రాగి సంకటి లాంటి పవిత్రమైందని, సైకో జగన్ ను తరిమి తరిమి కొట్టేందుకు ఈ సూపర్ సిక్స్ పని చేస్తుందని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో వైసీపీకి అభ్యర్థులు దొరకటం లేదని, ఎంపీ అభ్యర్థులు దొరకక ఇతర జిల్లాల నుంచి తీసుకు వస్తున్నారని అన్నారు. విజయనగరం నుంచి విశాఖపట్నానికి, చిత్తూరు నుంచి నరసరావుపేటకు బెట్టింగ్ స్టార్ను తీసుకువచ్చారని విమర్శించారు.

గుంటూరు సీటు కోసం ఓ క్రికెటర్ వస్తే ఎంత ఇస్తావని, ఎప్పుడు ఇస్తావని అడగటంతో ఆ క్రికెటర్ పారిపోయారని లోకేష్ ఆరోపించారు.., కర్నూలు ఎంపీ స్థానానికి రావటానికి ఓ మంత్రి ఒప్పుకోలేదని, తిరుపతి ఎంపీ స్థానానికి ఆదిమూలానికి ఇస్తు బై బై జగన్ అని ఆయన వెళ్లిపోయారని లోకేష్ చెణిగారు. 75 సీట్లకు అభ్యర్థులు దొరకటం లేదని, బీసీలను బ్యాక్ బోన్ అన్న వ్యక్తి బీసీలకు అన్యాయం చేశారని అన్నారు. ఎస్సీల దగ్గరకు వెళ్లి తాను దళిత బిడ్డనని చెప్పిన జగన్ అధికారం వచ్చాక అహంకారంతో చెలరేగిపోయారని అన్నారు, దళిత బిడ్డలపై రెచ్చిపోయి, మృతదేహాలను పార్శిల్ చేశారని, రాష్ట్రంలో సామాజిక న్యాయం లేదని, సామాజిక అన్యాయం ఉందని వైసీపీ నాయకులే అంటున్నారని లోకేష్ చెప్పారు. అభివృద్ధి కోట శృంగవరపుకోటని అవినీతి కోటగా ఎమ్మెల్యే కడుబండి మార్చేశారని ఆరోపించారు. కరోనా సమయంలో స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు నుంచి ఎమ్మెల్యే కడుబండి భారీగా కలెక్షన్లు చేశారన్నారు. అవినీతి సామ్రాట్ జగన్‌కు తానేమి తక్కువ కాదన్న రీతిలో ఎమ్మెల్యే కడుబండి అవినీతి డబ్బు యాభై కోట్లతో ప్యాలెస్ నిర్మించుకుంటున్నారని లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# జల్ జీవన్ మిశన్‌లో భాగంగా ఉన్న ప్రాజెక్టులు సహా రమారమి 2400 కోట్ల రూపాయల విలువ కలిగిన అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:'వికసిత్ భారత్, వికసిత్ రాజస్థాన్' కార్యక్రమం ఈ రోజు న జరగగా, ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర వోదీ వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యం ద్వారా ఆ కార్యక్రమం లో పాల్గొని సభ ను ఉద్దేశించి ప్రసంగించారు. 17,000 కోట్ల రూపాయల కు పైగా విలువ కలిగిన అనేక అభివృద్ధి ప్రాజెక్టుల ను ప్రధాన మంత్రి ప్రారంభించారు; వాటి ని దేశ ప్రజల కు అంకితమిచ్చి, కొన్ని ప్రాజెక్టుల కు శంకుస్థాపన కూడా చేశారు. ఈ ప్రాజెక్టు లు.. రహదారులు, రైలు మార్గాలు, సౌర శక్తి, విద్యుత్తు ప్రసారం, త్రాగునీరు మరియు పెట్రోలియమ్, ఇంకా ప్రాకృతిక వాయువు లు సహా అనేక ముఖ్యమైన రంగాల కు చెందినవి.

సభ ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, 'వికసిత్ భారత్, వికసిత్ రాజస్థాన్' కార్యక్రమం తో రాజస్థాన్ లో అన్ని నియోజకవర్గాల నుండి లక్షల సంఖ్య లో ప్రజలు పాలుపంచుకోవడాన్ని గమనించి, ఈ కార్యక్రమం లో వారు పాలుపంచుకొంటున్నందుకు గాను వారి కి ధన్యవాదాల ను తెలియ జేశారు. లబ్ధిదారులు అందరినీ ఒక చోటు కు తీసుకొని రావడం కోసం సాంకేతిక విజ్ఞానాన్ని ఎంతో చక్కగా వినియోగించుకొన్నందుకు రాజస్థాన్ ముఖ్యమంత్రి కి కూడా ప్రధాన మంత్రి అభినందనల ను తెలియ జేశారు. రాజస్థాన్ యొక్క ప్రజల లోని సద్గుణాల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర వోదీ ప్రముఖం గా ప్రస్తావిస్తూ, ఫ్రాన్స్ అధ్యక్షుడు శ్రీ ఇమ్మేన్యుయెల్ మేక్రోన్ రాజస్థాన్ కు కొన్ని రోజుల క్రితం విచ్చేసినప్పుడు ప్రజలు ఆయన కు స్వాగతం పలికిన తీరు ను గుర్తు కు తీసుకు వచ్చారు. ఆనాటి సాదర ఆహ్వానం భారతదేశం లో పలు ప్రాంతాల లో మారుమ్రోగుతుండడం ఒక్కటే కాకుండా దాని ప్రతిధ్వనులు ఫ్రాన్స్ లో కూడా వినిపించాయన్నారు. రాజస్థాన్ లో విధాన సభ కు ఎన్నికలు జరిగిన కాలం లో ఈ రాష్ట్రాన్ని తాను సందర్శించిన సందర్భం లో ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదాల ను కూడా ప్రధాన మంత్రి గుర్తు కు తెచ్చుకున్నారు. 'మోదీ కీ గ్యారంటీ' ('మోదీ హామీ') పట్ల నమ్మకాన్ని పునరుద్ధరించడం తో డబల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడింది అని ఆయన అన్నారు. రహదారులు, రైలు మార్గాలు, సౌర శక్తి, విద్యుత్తు ప్రసారం, త్రాగునీరు మరియు పెట్రోలియమ్, ఇంకా ప్రాకృతిక వాయువు రంగాల లో 17,000 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టు లు ఈ రోజు న కార్యరూపం దాలుస్తున్నందుకు రాజస్థాన్ ప్రజల కు అభినందనల ను ప్రధాన మంత్రి తెలియ జేశారు. ఈ ప్రాజెక్టు లు రాష్ట్రం లో లెక్కలేనన్ని ఉద్యోగ అవకాశాల ను అందిస్తాయన్నారు.

'యహీ సమయ్ హై - సహీ సమయ్ హై' ('ఇదే సమయం - సరైన సమయం') అంటూ ఎర్ర కోట యొక్క బురుజుల మీది నుండి ప్రధాన మంత్రి తాను ఇచ్చిన పిలుపు ను మళ్ళీ ప్రస్తావిస్తూ, ప్రస్తుత కాలం ఒక బంగారు కాలం గా ఉంది అన్నారు. ఇప్పుడు భారతదేశం మునుపటి దశాబ్దాల యొక్క నిరుత్సాహాన్ని వీడి, పూర్ణ విశ్వాసం తో ముందుకు సాగిపోవచ్చు అని పేర్కొన్నారు. 2014 వ సంవత్సరాని కంటే పూర్వం కుంభకోణాలు, అభద్రత మరియు ఉగ్రవాదం తాలూకు చర్చ జరిగేదని, దీనికి భిన్నం గా ప్రస్తుతం 'వికసిత్ భారత్ మరియు వికసిత్ రాజస్థాన్' తాలూకు లక్ష్యం పై మేం శ్రద్ధ తీసుకొంటున్నాం అని ఆయన అన్నారు. "ఈ రోజు న మనం పెద్ద సంకల్పాల ను తీసుకొంటున్నాం, పెద్ద కలల ను కంటున్నాం, మరి మనం వాటిని నెరవేర్చుకోవడం కోసం మనల ను మనం అంకితం చేసుకొంటున్నాం" అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. "నేను వికసిత్ భారత్ ను గురించి ఎప్పుడైతే మాట్లాడానో అది కేవలం ఒక మాటో, ఒక ఉద్వేగమో కాదు, అది ప్రతి ఒక్క కుటుంబం యొక్క జీవనాన్ని సమృద్ధం చేయడం కోసం చేపట్టినటువంటి ఒక ప్రచార ఉద్యమం" అని ఆయన అన్నారు. వికసిత్ భారత్ అనేది పేదరికాన్ని నిర్మూలించి, నాణ్యమైన ఉద్యోగాల ను కల్పించి మరి అలాగే దేశం లో ఆధునాతన సదుపాయాల ను నిర్మించడం కోసం చేపట్టిన ప్రచార ఉద్యమం అని ఆయన వివరించారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నిన్నటి రోజు న తాను విదేశీ సందర్శన నుండి తిరిగి వచ్చినట్లు చెప్తూ, ఆ సందర్భం లో ప్రపంచ నాయకుల తో తాను జరిపిన సమావేశాల ను గురించి ప్రస్తావించారు. భారతదేశం పెద్దవైన కలల ను కనే స్థితి లో ఉందని, మరి ఆయా కలల ను పండించుకోగలదని ప్రపంచ నేత లు అంగీకరిస్తున్నారని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

"వికసిత్ భారత్ యొక్క అభివృద్ధి కి ఒక వికసిత్ రాజస్థాన్ ను ఆవిష్కరించడం తప్పనిసరి" అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. రైలు మార్గాలు, రహదారి మార్గాలు, విద్యుత్తు మరియు నీరు ల వంటి అత్యవసర రంగాల లో శరవేగం గా అభివృద్ధి చోటుచేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఆ తరహా రంగాల అభివృద్ధి వల్ల రైతుల కు, పశు సంరక్షుల కు, పరిశ్రమల కు మరియు పర్యటన రంగాని కి తదితర రంగాల కు భారీ గా లబ్ధి కలుగుతుంది; అంతేకాకుండా, అదే జరిగిన నాడు రాష్ట్రాని కి క్రొత్త పెట్టుబడులు మరియు ఉద్యోగ అవకాశాలు అందివస్తాయి అని ఆయన అన్నారు. ఈ సంవత్సరం లో యూనియన్ బడ్జెటు లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కి గాను రికార్డు స్థాయిలో 11 లక్షల కోట్ల రూపాయల ను కేటాయించడమైందని, అది ఏ మునుపటి ప్రభుత్వం కేటాయించిన దానితో పోల్చి చూసినప్పటికీ ఆరు రెట్లు అధికం గా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ వ్యయం సిమెంటు పరిశ్రమల కు, పింగాణి వస్తువుల పరిశ్రమల కు, ఇంకా రాళ్ళ పరిశ్రమల కు ఎంతో ప్రయోజనాన్ని చేకూర్చుతుంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నొక్కిచెప్పారు.

రాజస్థాన్ లో గడచిన 10 సంవత్సరాల లో గ్రామీణ ప్రాంతాల రహదారులు, హైవేన్, ఇంకా ఎక్స్‌ప్రెస్ వేస్ లలో ఇదివరకు ఎన్నడూ ఎరుగనంతటి పెట్టుబడి ని పెట్టడం జరిగింది అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం రాజస్థాను ను విశాలమైన హైవే స్ మాధ్యం ద్వారా గుజరాత్, మహారాష్ట్ర ల లోని కోస్తా తీర ప్రాంతాల మొదలుకొని పంజాబ్ వరకు సంధానించడం జరుగుతున్నది అని ఆయన అన్నారు. ఈ రోజు న చేపట్టుకొంటున్న ప్రాజెక్టు లు కోటా, ఉదయ్‌పుర్, టోంక్, సవాయీ మాధోపుర్, బూందీ, అజ్ మేర్, భీల్‌వాడా, మరియు చిత్తౌడ్ గఢ్ లలో కనెక్టివిటీ ని మెరుగు పరుస్తాయి. ఈ రహదారులు దిల్లీ కి, హరియాణా కు, గుజరాత్ కు మరియు మహారాష్ట్ర కు మెరుగైన కనెక్టివిటీ కి సైతం పూచీ పడతాయి.

నేటి కార్యక్రమాల లోని మరికొన్ని అంశాలు అయిన విద్యుతీకరణ ను గురించి రైలు మార్గాల కు కొత్త రూపు రేఖల ను సంతరించడం మరియు మరమ్మతు పనుల ను చేపట్టడం వంటి గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, బాందీకుయీ-ఆగ్ రా ఫోర్ట్ రైలు మార్గం డబ్లింగు తో మెహందీపుర్ బాలాజీ మరియు ఆగ్ రా లను చేరుకోవడం సులభతరం అవుతుంది అని వివరించారు. అదే విధం గా మరిన్ని రైళ్ళు నడిపేందుకు వీలు ను ఖాతీపురా (జయ్ పుర్) స్టేశన్ కల్పిస్తుంది అని ఆయన అన్నారు.

పౌరులు వారి సొంత ఇళ్ళ లో సౌర విద్యుత్తు ను ఉత్పత్తి చేయడాని కి అనువుగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుంది అని స్పష్టం చేస్తూ, అదే కాలం లో అదనపు విద్యుత్తును విక్రయించడం ద్వారా ఆదాయార్జన కు కూడా అవకాశం ఉంటుంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. పిఎమ్ సూర్య ఘర్ యోజన ( ఉచిత విద్యుత్తు పథకం) ను ప్రారంభించడాన్ని గురించి శ్రీ నరేంద్ర వోదీ ప్రముఖం గా ప్రకటిస్తూ, దీని ద్వారా ప్రభుత్వం 300 యూనిట్ ల విద్యుత్తు ను ఉచితం గా అందించే ఏర్పాటు చేసింది అన్నారు. మొదటి దశ లో ఒక కోటి ఇళ్ళ మిద్దెల మీద సౌర ఫలకాల ను ఏర్పాటు చేయడం కోసం ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం సమకూర్చుతుందని, ఈ ప్రాజెక్టు కు దాదాపు గా 75,000 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని ఆయన తెలియ జేశారు. దీని ద్వారా సమాజం లో మధ్య తరగతి ప్రజలు మరియు దిగువ మధ్య తరగతి ప్రజలు అత్యధిక ప్రయోజనాన్ని పొందనున్నారని ఆయన వివరించారు. బ్యాంకు లు సైతం సులభతర రుణ వితరణ కు ముందుకు వస్తాయి అని ఆయన చెప్పారు. "రాజస్థాన్ లో అయిదు లక్షల గృహాల లో సౌర ఫలకాల ను నెలకొల్పడాని కి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. పేదవారు మరియు మధ్య తరగతి కుటుంబాల కు అయ్యే ఖర్చు ను తగ్గించడం లో డబల్ ఇంజన్ ప్రభుత్వం యొక్క ప్రయాసల ను గురించి ఆయన నొక్కిచెప్పారు.

# అంబర్పేట పరిసర ప్రాంతాల్లో గల నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు

హైదరాబాద్ ఫిబ్రవరి 17 (ఎస్ ప్రెస్ న్యూస్);అంబర్పేట పరిసర ప్రాంతాల్లో గల నిరుద్యోగ మహిళలకు నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిటైల్ మరియు సేల్స్ రంగంలో 28 రోజుల ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి శ్రీకాంత్ నేడొక ప్రకటనలో తెలిపారు.శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం తో పాటుఎన్ఎస్డిసి తరఫున సర్టిఫికెట్ కూడా అందజేయబడుతుందని తెలిపారు. శిక్షణ సమయంలో విద్యార్థులకు రీటల్ తో పాటు ఎమ్మెస్, ఆఫీస్, టైపింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ మరియు సాఫ్ట్ స్కిల్ కూడా నేర్పించబడుతుందని ఆయన పేర్కొన్నారు. వయస్సు 18 నుంచి 30 సంవత్సరాలు ఉండవలెను. విద్య అర్హులు ఇంటర్ పాస్ ఆపై నవారు హర్హులు. వివరాలకు హైదరాబాద్ అంబర్పేట్ లో గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీని సంప్రదించాలని ఆయన కోరారు




# సీఎం సొంత జిల్లాలో అవిశ్వాసం పిడుగు!

హైదరాబాద్, ఫిబ్రవరి 17:వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పట్నం సునీతా మహేందర్ రెడ్డిపై బీఆర్ఎస్ జెడ్పీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. మొత్తం 12 మంది తీర్మానంపై సంతకాలు చేశారు. శుక్రవారం సునితారెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. 24 గంటల్లోనే బీఆర్ఎస్ అధిష్ఠానం వేగంగా పావులు కదిపి సునితారెడ్డిపై అవిశ్వాసం పెట్టించింది. కాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో ఈ పరిణామం చోటుచేసుకోవడం రాజకీయ దుమారం రేగింది. ఒకరకంగా చెప్పాలంటే ఇది రేవంత్ రెడ్డికి ఇబ్బందికర పరిస్థితి. శనివారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన మొత్తం 12 మంది జెడ్పీటీసీలు చైర్ పర్సన్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేశారు. ఇందులో కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు జెడ్పీటీసీలు ఉండడం గమనార్హం.

వికారాబాద్ జిల్లా పరిషత్ లో మొత్తం 18 మంది జెడ్పీటీసీలున్నారు. వీరిలో ఇద్దరు మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన వారున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక జెడ్పీటీసీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీకే చెందిన ఇద్దరు (యాలాల, బొంరాస్ పేట్ మండలం) అవిశ్వాసంపై సంతకం చేయలేదు. అవిశ్వాసానికి అవసరం అయిన 12 మంది సంతకాలు చేయడం గమనార్హం. కొడంగల్ కు చెందిన ఇద్దరు జెడ్పీటీసీలు, వికారాబాద్, పరిగి నియోజకవర్గాలకు చెందిన నలుగురు చొప్పున, తాండూరు, చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన ఒక్కో జెడ్పీటీసీ తీర్మానంపై సంతకాలు చేశారు.

## అదనపు కలెక్టర్‌కు తీర్మానం అందజేత..

కాంగ్రెస్ పార్టీలో చేరిన జెడ్పీ చైర్ పర్సన్ సునితారెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని శనివారం బీఆర్ఎస్ జెడ్పీటీసీలు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కు అందించారు. అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టి వెంటనే వారంతా అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం గమనార్హం. పార్టీ అధిష్టానం వీరందరిని రహస్య ప్రదేశానికి తరలించినట్లు సమాచారం.

# బొగ్గు వాయువీకరణపై పరిశ్రమల పరస్పర చర్చ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:దేశవ్యాప్తంగా బొగ్గు/ వాయువీకరణ ప్రాజెక్టులను ప్రోత్సహించే లక్ష్యంతో బొగ్గు మంత్రిత్వ శాఖ ఈరోజు హైదరాబాద్‌లో పరిశ్రమల పరస్పర చర్చను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అమృత్ లాల్ మీనా హాజరయ్యారు. ఈ కార్యక్రమం బొగ్గు/ వాయువీకరణ ప్రాజెక్టుల ప్రోత్సాహం కోసం ప్రభుత్వ పథకాన్ని హైలైట్ చేయడానికి వేదికయ్యింది. భారతదేశం యొక్క ఇంధన రంగ మరియు ఆర్థిక అభివృద్ధిలో వారి కీలక పాత్రను నొక్కి చెప్పింది.

ప్రధానోపన్యాసం చేస్తూ, కార్యదర్శి (బొగ్గు) శ్రీ అమృత్ లాల్ మీనా, భారతదేశ ఇంధన భద్రతలో బొగ్గు యొక్క ప్రాముఖ్యతను మరియు దేశీయ బొగ్గు ఉత్పత్తి పెరుగుదలకు బొగ్గు దిగుమతుల్లో గణనీయమైన తగ్గుదలకు (2019లో 26% నుండి ఈ సంవత్సరం 19%కి - అంచనా వేయబడింది) దారితీసిన ప్రైవేట్ కంపెనీలను తీసుకురావడానికి భారత ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను వివరించారు. భారతదేశ ఇంధన పరివర్తనలో బొగ్గు మరియు లిగ్నైట్ వాయువీకరణ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. సులభతరమైన భూ లభ్యత, రుణాలు మరియు స్వచ్ఛ బొగ్గు సాంకేతికతలను ప్రోత్సహించడం మరియు ఇంధన భద్రతను పెంపొందించే ప్రోత్సాహకాలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం యొక్క మద్దతును పునరుద్ఘాటిస్తూ, హరిత మరియు పరిశుభ్రమైన భవిష్యత్తు కోసం సాంకేతికతలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

భారత ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఉ నామినేటెడ్ అథారిటీ శ్రీ ఎం. నాగరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణ సమస్యలను పరిష్కరిస్తూ దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో వాయువీకరణ ప్రాజెక్టుల ప్రాముఖ్యత మరియు సంభావ్యత గురించి అంతర్దృష్టిని అందించారు. వాయువీకరణ రంగంలో సీ ఐ ఎల్ యొక్క చురుకైన కార్యక్రమాలు మరియు ప్రయత్నాల గురించి కోల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ శ్రీ పీఎం ప్రసాద్ వివరించారు. స్వచ్ఛ ఇంధన పరిష్కారాల వైపు పరివర్తన లో కీలక పాత్ర పోషించంలో కంపెనీ పాత్రను నొక్కి చెబుతూ, ఆవిష్కరణ మరియు సుస్థిరత్వం పట్ల సీ ఐ ఎల్ యొక్క నిబద్ధతను ఆయన హైలైట్ చేశారు. మరింత పరిశుభ్ర భవిష్యత్తును నిర్మించడానికి మరియు 2070 నాటికి నికర సున్నా లక్ష్యాన్ని సాధించడంలో సహాయం చేయడానికి బొగ్గు వాయువీకరణలో ఉన్న అవకాశాల కోసం సీ ఐ ఎల్ తో భాగస్వామ్యం కావడానికి సాంకేతిక సామర్థ్యాన్ని కలిగి ఉన్న ఆసక్తిగల పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు.

పథకానికి ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ అయిన ఎస్ బీ ఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ శుభమ్ గోయెల్, బొగ్గు/వాయువీకరణ ప్రాజెక్టుల ప్రోత్సాహం కోసం పథకం యొక్క ముఖ్య అంశాలపై ఒక ప్రదర్శన ఇచ్చారు. ముఖ్యోపన్యాసం అనంతరం పరిశ్రమ నిపుణులు వివిధ అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ప్రదర్శనల సందర్భంగా, బొగ్గు వాయువీకరణ లో అవకాశాలు, ఆర్ ఉ డీ ప్రయత్నాలు, కార్బన్ సీక్వెస్ట్రేషన్‌తో అనుసంధానించబడిన బ్లూ హైడ్రోజన్ కోల్ వాయువీకరణ; హై యాష్ కోల్ వాయువీకరణ మరియు హై యాష్ కోల్ వాయువీకరణలో మరిన్ని అవకాశాల కోసం ఆర్ ఉ డీ గురించి నిపుణులు మాట్లాడారు.

ఈ పథకంపై పరిశ్రమ వారి అభిప్రాయాలను సమర్పించింది, దీనిని బొగ్గు మంత్రిత్వ శాఖ అంగీకరించింది, వారు త్వరలోనే వాటాదారుల వ్యాఖ్యలు/అభిప్రాయాల కోసం పబ్లిక్ ఫోరమ్‌లో పథకం కోసం ఆర్ ఎఫ్ పీ ని ఉంచుతారని హామీ ఇచ్చారు.

శ్రీ అమృత్ లాల్ మీనా, కార్యదర్శి (బొగ్గు) తన ముగింపులో, భాగస్వామ్యాలను పెంపొందించడం, ఆవిష్కరణలు మరియు బొగ్గు రంగంలో సుస్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడంలో బొగ్గు మంత్రిత్వ శాఖ యొక్క చురుకైన విధానాన్ని మరింత నొక్కిచెప్పారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా మరియు బహిరంగంగా చేయడానికి పరిశ్రమ వాటాదారులందరూ ముందుకు వచ్చి ఆర్ ఎఫ్ పీ ప్రక్రియలో పాల్గొనాలని మరియు వారి విలువైన సూచనలను పంచుకోవాలని ఆయన అభ్యర్థించారు.

బొగ్గు రంగంలో నూతన ఆవిష్కరణలు మరియు సుస్థిరతను పెంపొందించడంలో ప్రభుత్వ నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రదర్శించింది. వ్యూహాత్మక కార్యక్రమాలు మరియు విధాన చట్రాల ద్వారా, బొగ్గు మంత్రిత్వ శాఖ బొగ్గు/ వాయువీకరణ ప్రాజెక్టులలో పెట్టుబడులు మరియు సాంకేతిక పురోగమనాలను ఉత్ప్రేరకపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. పరిశుభ్రమైన మరియు ఇంధన-సమర్థవంతమైన భవిష్యత్తు కోసం భారతదేశం యొక్క దృష్టికి ఇది అనుగుణంగా ఉంటుంది.

# కోర్టుల్లో 4.47 కోట్ల పెండింగ్ కేసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 17:మనదేశంలో కోర్టుల పనితీరు చూస్తే ఆశ్చర్యపోవలసిందే. న్యాయ స్థానాల గురించి నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ తాజాగా సమాచారం అందించింది. దేశంలోని కోర్టుల్లో 4.47 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం 25 హైకోర్టుల్లో అలహాబాద్ హైకోర్టు 10.74 లక్షల కేసులతో ముందుంది. దీని తర్వాత బాంబే హైకోర్టులో 7.13 లక్షల కేసులు, రాజస్థాన్ హైకోర్టులో 6.67 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జీడీజీ) అందించిన తాజా డేటాలో ఈ వివరాలు ఉన్నాయి.

## 2018 నుంచి పెరుగుతున్న కేసులు..

2018 నుంచి పెండింగ్ కేసుల సంఖ్య పెరిగింది. అలహాబాద్ హైకోర్టులో పెండింగ్ కేసులు 50.95 శాతం మేరకు పెరిగాయి. బాంబే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు 53.85 శాతం మేరకు పెరిగాయి. అన్ని హైకోర్టుల్లో మొత్తం 62 లక్షల కేసులు పెండింగ్‌లో ఉండగా, వీటిలో 71.6 శాతం సివిల్ కేసులు, 28.4 శాతం క్రిమినల్ కేసులు. 2018 నుంచి ఈ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య పెరిగింది. 24.83 శాతం కేసులు 5 నుంచి 10 ఏళ్ల క్రితం నాటివి. 24.83 శాతం కేసులు 5 నుంచి 10 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. 18.25 శాతం కేసులు 10 నుంచి 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి.

పలు నివేదికల ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసులకు న్యాయమూర్తుల సంఖ్య సరిపోకపోవడమే ప్రధాన కారణం. 2023 మే నాటికి దాదాపు 25,600 మంది న్యాయమూర్తులు నాలుగు కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులను విచారించే లేదా తీర్పునిచ్చే పనిలో ఉన్నారు.

# అందరికీ అందుబాటులో ఉండే భారత డిపిఐలను కొలంబియాతో పంచుకునేందుకు ఎంఒయుపై సంతకాలు చేసిన భారత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:డిజిటల్ పరివర్తన కోసం జనాభా శ్రేణిలో అమలు చేసేందుకు విజయవంతమైన డిజిటల్ పరిష్కారాలను పంచుకోవడంలో సహకారం కోసం భారతదేశం ఉ కొలంబియా అవగాహనా ఒప్పందం (ఎంఒయు)పై సంతకాలు చేశాయి. జఈ ఒప్పందంపై ఎలక్ట్రానిక్స్ఉ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఇఐటివై), కొలంబియాకు చెందిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ అండ్ కమ్యూనికేషన్స్ సంతకాలు చేశాయి.

కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటి, నైపుణ్యాల అభివృద్ధి ఉ వ్యవస్థాపకత, జలశక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్ర శేఖర్, కొలంబియా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ అండ్ కమ్యూనికేషన్స్ మం?రతి శ్రీ మారీషియో లిజ్‌కానో ఎంఒయులను ఇచ్చి పుచ్చుకున్నారు.

భారత్ తరుఫున దీనిపై ఎంఇఐటివై కార్యదర్శి శ్రీ ఎస్ కృష్ణన్, కొలంబియా వైపు నుంచి శ్రీమారిషయాఓ లికాంకోలు సంతకాలు చేశారు. సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలు, ఉత్తమ ఆచరణల బదలాయింపు, ప్రభుత్వాధికారులు, నిపుణుల బదిలీ, పైలెట్ లేదా డెమో పరిష్కారాలను అభివృద్ధి చేయం, ఇరు దేశాలలోని డిజిటల్ పర్యావరణ వ్యవస్థ నుంచి పరస్పరం లబ్ధి పొందేందుకు ప్రైవేటు రంగంలోని వారికి సౌలభ్యతను కల్పించడం ద్వారా డిజిటల్ పరివర్తన (ఇండియా స్టాక్ - ఎబౌఆఎం ూంఅఐ)ను ప్రోత్సహించడం ఎంఒయు ఉద్దేశ్యం.

ఇరు పక్షాలూ డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాల గురించి చర్చించాయి. ఈ మౌలిక సదుపాయాలు సురక్షితమైన, పరస్పరం పని చేయగల భాగస్వామ్య డిజిటల్ వ్యవస్థను ఏర్పరుస్తాయి. వాటిని ప్రభుత్వ, ప్రైవేట్ సేవలకు సమాన ప్రాప్యతను అందించేందుకు, బట్వాడా చేసేందుకు ఓపెన్ స్టాండర్డ్స్ (బహిరంగ ప్రమాణాల)పై వాటిని నిర్మించవచ్చు. ఇండియా స్టాక్ పరిష్కారాలు అనేవి ప్రభుత్వ సేవల అందుబాటు, బట్వాడాను అందించే ఒదుకు ప్రజా శ్రేణి కోసం భారత్ అభివృద్ధి చేసి, అమలు చేసినవి డిపిఐలు.

కొలంబియాలో డిజిటల్ ప్రజా మౌలికసదుపాయాలను సజావుగా స్వీకరించడానికి దారి తీసే డిజిటల్ పరివర్తపై అభివృద్ధి భాగస్వామ్యాన్ని నిర్మించడం ద్వారా కొలంబియాతో భాగస్వామ్యం కోసం భారత్ ఆసక్తితో ఉంది.

# విచ్చలవిడిగా మైనింగ్ వల్ల చీమకుర్తి కారు మంచి మేజర్ కాలువకు పగుళ్లు

### -రికార్డ్స్ పరిశీలించిన వినియోగదారుల మండలి

### -ఇన్లీగల్ మైనింగ్ పై ఆయా సంస్థలపై లోకాయుక్త లో ఫిర్యాదు



ఒంగోలు ఫిబ్రవరి 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఒంగోలు జిల్లా చీమకుర్తి నగర పంచాయతీ వ్యవసాయ భూములు, నీటిపారుదల కాలువలు పరిసరాలలో విచ్చలవిడిగా మైనింగ్, క్వారీల తవ్వకాల వల్ల - చీమకుర్తి కారు మంచి మేజర్ కాలువకు పగుళ్లు, రహదారి ధ్వంసం పై స్థానికుల ఫిర్యాదు మేరకు, వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి, ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు పిడతల రమేష్ రెడ్డి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు దూదేకుల బాదుల్లా లు ఒంగోలు మైనింగ్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో చీమకుర్తి మైనింగ్ సంస్థల అనుమతుల రికార్డు లను, సమాచార హక్కు చట్టం 2005 పరిధిలో " రికార్డుల పరిశీలన" చేయడం జరిగింది. చీమకుర్తి లోని రెండు పెద్ద మైనింగ్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా మరియు పక్కనే నీటి కాలువ ధ్వంసానికి కారణమైన మైనింగ్ నిర్వహిస్తున్న క్రమంలో లైసెన్స్ లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే ఇన్లీగల్ మైనింగ్ నిర్వహించినందుకు జరిమానా వివరాలు ప్రకటించలేదు. ఇంకా మిగతా మైనింగ్, క్వారీల వివరాలు అందిన పిదప వినియోగదారుల మండలి ఆయా సంస్థలపై లోకాయుక్త లో ఫిర్యాదు చేయనున్నది. అలాగే చీమకుర్తి నుండి ఒంగోలు వెళ్లే స్టేట్ హైవే రోడ్డు కు కేవలం అయిదు మీటర్ల దూరంలో లోనే మైనింగ్ జరుగుతున్న మైనింగ్ సంస్థలు, క్వారీల ప్రదేశాలను నేడు వినియోగదారుల జాతీయ కమిటీ సభ్యులు పరిశీలించారు.

# సాయుధ బలగాలు & భారతీయ తీర రక్షణ దళం శక్తిసామర్థ్యాలు పెంచేందుకు రూ.84,560 కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని 'డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్' (డాక్), రూ. 84,560 కోట్ల విలువైన వివిధ ఆయుధాలు, రక్షణ సంబంధ పరికరాల కొనుగోళ్ల కోసం 'యాక్సెప్టాన్స్ ఆఫ్ నెసెసిటీ'కు (ఏవోఎన్) ఆమోదంతెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో 16 ఫిబ్రవరి 2024న ఇచ్చిన ఆమోదాల ద్వారా భారతీయ విక్రేతల నుంచి వివిధ పరికరాల సేకరణకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు.

'బయ్' విభాగం కింద (దేశీయంగా రూపొందించి, తయారు చేసిన), రిమోట్ ద్వారా పని చేయించగల ఉ భూ ప్రకంపనలు గుర్తించగల కొత్త తరం ట్యాంక్ నిర్వీర్య మందుపాతరల సేకరణ కోసం డాక్ ఆమోదం తెలిపింది. వ్యూహాత్మక యుద్ధ ప్రాంతంలో నిర్దేశిత లక్ష్యాలను ఛేదించేలా భద్రత బలగాల సామర్థ్యాన్ని ఉ ఆధిపత్యాన్ని మెరుగుపరచడానికి 'కాన్సిస్టర్ లాంచ్‌డ్ యాంటీ-ఆర్మర్ లొయిటర్ మ్యూనిషన్ సిస్టమ్' సేకరణ కోసం కూడా 'బయ్' విభాగం కింద ఏవోఎన్‌కు ఆమోదం తెలిపారు.

గగనతల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి, ముఖ్యంగా చిన్న పరిమాణంలో ఉండి నెమ్మదిగా, తక్కువ ఎత్తులో ఎగిరే లక్ష్యాలను గుర్తించే సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, వివిధ లక్ష్యాలపై నిఘా పెట్టడానికి 'బయ్' విభాగం కింద 'ఎయిర్ డిఫెన్స్ టాక్టికల్ కంట్రోల్ రాడార్' సేకరణ కోసం ఏవోఎన్‌కు ఆమోదం దొరికింది.

భారతీయ నౌకాదళం ఉ తీర రక్షణ దళం (ఐసీజీ) నిఘా సామర్థ్యాలన్ని పెంచడానికి, 'బయ్' ఉ 'మేక్' విభాగం కింద మధ్య స్థాయి సముద్ర నిఘా ఉ బహుళ విధుల సముద్ర విమానం కొనుగోలు కోసం ఏవోఎన్‌కు అనుమతి మంజూరైంది.

ప్రత్యర్థుల వ్యూహాల కంటే భారతీయ నౌకాదళాన్ని ఒక అడుగు ముందే ఉంచడానికి, ప్రత్యర్థి జలాంతర్గాములను తక్కువ పౌనఃపున్యాల వద్ద ఉ సుదూరంలో ఉండగానే గుర్తించే సామర్థ్యం గల 'యాక్టివ్ టోవ్డ్ అర్రే సోనార్' కొనుగోలు చేయడానికి 'బయ్' విభాగం కింద డాక్ ఏవోఎన్ ఇచ్చింది. కల్వరి తరగతి జలాంతర్గాముల దాడి సామర్థ్యాలను పెంచేందుకు భారీ స్థాయి టార్పెడోల సేకరణకు కూడా ఏవోఎన్‌కు అనుమతి లభించింది. అమెరికా ప్రభుత్వంతో 'ఫారిన్ మిలిటరీ సేల్ రూట్' కింద, 24 ఎంహెచ్60ఆర్ విమానాలకు 'ఫాలో ఆన్ సపోర్ట్' (ఎఫ్‌వోఎస్), 'ఫాలో ఆన్ సప్లై సపోర్ట్' (ఎఫ్‌వోఎస్ఎస్) ద్వారా మరమ్మతుల కోసం కూడా ఏవోఎన్ ఇచ్చారు.

భారత వైమానిక దళం సామర్థ్యం ఉ దూకుడును పెంచడానికి గాలిలోనే ఇంధనం నింపే విమానాల సేకరణ కోసం డాక్ ఏవోఎన్ ఇచ్చింది. ఐసీజీ కోసం సాఫ్ట్‌వేర్ ఆధారిత రేడియోల కొనుగోళ్ల కోసం 'బయ్' విభాగం కింద ఏవోఎన్ మంజూరైంది. దీనివల్ల ఐసీజీ - భారతీయ నౌకాదళం మధ్య అవాంతరాలు లేని, వేగవంతమైన ఉ సురక్షితమైన సమాచార మార్పిడి జరుగుతుంది.

'ఇన్నోవేషన్స్ ఫర్ డిఫెన్స్ ఎక్సలెన్స్' (ఐడెక్స్) ఉ సాంకేతికత అభివృద్ధి నిధి పథకాల ద్వారా స్నేహపూర్వక రక్షణ రంగ అంకుర సంస్థల వ్యవస్థను రూపొందించడానికి, అంకుర సంస్థలు ఉ ఎంఎస్ఎంఈల నుంచి ఆధునిక సాంకేతికతల సేకరణను ప్రోత్సహించడానికి 'డిఫెన్స్ అక్విజిషన్ ప్రొసీజర్ (డాప్) 2020' నిబంధనలు, ఖర్చుల లెక్కింపు, చెల్లింపుల షెడ్యూల్, సేకరణ పరిమాణం మొదలైన వాటిలో సవరణలను డాక్ ఆమోదించింది. 'సులభతర వ్యాపారం' స్ఫూర్తితో, ఐడెక్స్ ఉ టీడీఎఫ్ పథకాల కింద అంకుర సంస్థలు ఉ ఎంఎస్ఎంఈలకు ఇది చాలా ప్రోత్సాహాన్ని అందిస్తుంది.

# దూదూ బసవన్నకూ.. ఆన్‌లైన్ పేమెంటు

హైదరాబాద్, ఫిబ్రవరి 17:ఆన్‌లైన్ పేమెంట్స్ జనజీవనంలో ఓ భాగంగా మారిపోయాయి. చాలావంది జేబులో డబ్బులు ఉంచుకోవడం కూడా మానేస్తున్నారు. ఈ క్రమంలో యాచకులు ఎదురైతే జేబులు తడుముకొని చిల్లర లేదని చెప్పడం పరిపాటిగా మారింది. దీంతో యాచకులు కూడా కాలానుగుణంగా మారుతూ క్యూఆర్ కోడ్ వెంట తీసుకెళ్తున్నారు. ఆ కోవలోనే సికింద్రాబాద్ ప్రాంతంలో ఓ ఆలయం వద్ద తన గంగిరెద్దు తలపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశాడు. గంగిరెద్దు విన్యాసాలు పూర్తి అయిన తర్వాత ప్రజలు స్కాన్ చేసి డబ్బు పంపగానే 'అయ్యగారికి దండం పెట్టు' అంటూ దూడూబసవన్నతో దండాలు పెట్టించి దీవిస్తున్నాడు ఈ యాచకుడు.

# అసెంబ్లీలో మంత్రులు, హరీష్ మధ్య మాటల యుద్ధం

హైదరాబాద్, ఫిబ్రవరి 17:సాగునీటి ప్రాజెక్ట్ ల శ్వేతపత్రంపై అసెంబ్లీలో మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ.. 'ఇంజనీరింగ్ అధికారులు చెప్పడం వల్లే రీడిజైన్ చేశాం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భూగర్భ జలాలు పెరిగాయి. ప్రాణహితకు జాతీయహోదా ఇవ్వాలని కేంద్రానికి కేసీఆర్ లేఖ రాశారు. బీఆర్ఎస్ హయాంలోనే వలసలు తగ్గాయి. ఎస్ఆర్ఎస్పీ-2కు నీళ్లిచ్చిన ఘనత మాది. కేసీఆర్ వచ్చాకే రెండు పంటలకు నీరిచ్చాం. కాంగ్రెస్ పాలనలో నీరు రాలేదు ఎందుకు.. కేసీఆర్ వచ్చాకే ఎలా నీళ్లు వచ్చాయి. అవినీతి ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా సిద్ధం. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణకు అన్యాయం జరిగిందని కవులు, కళాకారులు గొంతెత్తి పాడారు. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వలసలు వస్తున్నారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రతీసారి అబద్ధాలే చెబుతున్నారు. గోబెల్స్ అవార్డు ఉత్తమ్‌కే ఇవ్వాలి అంటూ ఎద్దేవా చేశారు?

30ఏళ్ల తర్వాత నాగార్జునసాగర్ కింద పూర్తిస్థాయిలో ఆయకట్టు వచ్చింది. కల్వకుర్తి ప్రాజెక్ట్ కట్టడానికి 30ఏళ్లు పట్టింది. కాగ్ రిపోర్టుపై కాంగ్రెస్‌ది సెల్ఫ్‌గోల్. కాగ్ నివేదికకు ప్రమాణికం లేదని గతంలో కాంగ్రెస్ చెప్పింది. కాగ్ రిపోర్ట్‌ను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు తప్పుపట్టాయి. కాగ్ నివేదిక తప్పుల తడక అని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ అన్నారు. కాగ్ నివేదికల్లో ప్రమాణికం లేదని గతంలో కాంగ్రెస్ చెప్పింది అని గుర్తు చేశారు..



### శ్వేతపత్రం కాదు?అబద్దాల నివేదిక..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలో నాలుగు అంశాలు అబద్ధాలే. గత ప్రభుత్వంపై బురదజల్లేందుకే ఈ నివేదిక తీసుకొచ్చారు. ఇందులో అబద్ధాలు ఉన్నాయని నేను రుజువు చేస్తాను. మిడ్‌మానేరు, ఎల్లంపల్లి ప్రాజెక్టులు ఉమ్మడి రాష్ట్రంలోనే పూర్తయ్యాయని మంత్రి ఉత్తమ్ చెప్పారు. అయితే, 2014 నాటికి నేను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే సమయానికి మిడ్‌మానేరు ప్రాజెక్టుకు సంబంధించి రూ.106 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక రూ.775 కోట్లు ఖర్చు చేసి మూడేళ్ల తర్వాత ప్రాజెక్టును పూర్తి చేశామని వివరించారు హరీష్ రావు.

ఖర్చులు వర్సెస్ ఆయకట్టు విషయంలో శ్వేతపత్రంలో రెండుచోట్ల వేర్వేరుగా ప్రస్తావించారు. 2014కు 57.79 లక్షల ఎకరాలకు నీరిస్తే.. రూ. 54,234 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. ఇదే నివేదికలో మరో చోట 1956-2014 మధ్య కాలంలో ఉమ్మడి ఏపీలోని తెలంగాణలో రూ.54,234 కోట్లు ఖర్చు పెట్టి 41.76 లక్షల ఎకరాలను నీరిచ్చామని చెప్పాంం. ఒకే అంశంపై భిన్నమైన సమాచారాన్ని నివేదికలో పొందుపర్చారు. ఖర్చులో ఎలాంటి మార్పు లేదు. నీరందించిన ఆయకట్టు విస్తీర్ణంలో మాత్రం తేడా ఉందని అంకెలతో సహా వివరించారు. రాయలసీమ ఎత్తిపోతలపై మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ? లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్పటి ప్రభుత్వం (బీఆర్ఎస్) కేంద్రానికి ఫిర్యాదు చేయలేదన్నారని హరీష్ లేవనెత్తారు.. అయితే ఈ అంశానికి సంబంధించి గతంలోనే పూర్తి ఆధారాలతో సహా నేను పూర్తి వివరణ ఇచ్చాను. అయినా సరే మళ్లీ అబద్ధాలు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు జీవో వచ్చింది 5/5/2020లో ఈ జీవో రాకముందే కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాం. మే 5న జీవో వస్తే వారం రోజుల వ్యవధిలోనే మరోసారి కేంద్రానికి, కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశాం. ఆ లెటర్లు కావాలంటే సభలో ప్రవేశపెడతాం. మేం అసలు ఫిర్యాదే చేయలేదనే అబద్ధాలను పదేపదే చెబుతున్నారు. ఇది పద్ధతి కాదు అంటూ కామెంట్స్ చేశారు హరీష్ రావు.

# ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలి

### - ఆంధ్ర ప్రదేశ్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన



అమరావతి ఫిబ్రవరి 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్); : ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను రాష్ట ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్ర ప్రదేశ్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఆందోళన నిర్వహించారు. గుంటూరులో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ (ఖఖీఅ), ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన బకాయిలే ప్రభుత్వాన్ని అడుగుతున్నామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క డీఏ ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఉద్యోగులకు రావాల్సిన 26వేల కోట్ల రూపాయలను ఇవ్వడం లేదని మండిపడ్డారు. జీతాలను సకాలంలో ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తుందని అన్నారు.

గత్యంతరం లేని పరిస్థితిల్లో ఉద్యోగులు ఆందోళన చేపడుతున్నారని ఆయన వెల్లడించారు.

# కార్పొరేట్ ఫైలింగ్స్ కేంద్రీకృత (సెంట్రలైజ్డ్) ప్రాసెసింగ్ కోసం సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్(సిపిసి) ను నిర్వహిస్తున్న ఎం సి ఎ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:2023-224 కేంద్రబడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అందించడానికి నిరంతర ప్రయత్నం తరహాలో, కంపెనీల చట్టం, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్ నర్ యాక్ట్ (ఎల్ఎల్ పి యాక్ట్) కింద వివిధ నియంత్రణ అవసరాలలో భాగంగా దాఖలు చేసిన ఫారాలను వాటాదారులతో నేరుగా ముఖాముఖి అవసరం లేకుండా కేంద్రీకృత పద్ధతిలో ప్రాసెస్ చేయడానికి సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సిపిసి) ఏర్పాటు అయింది.

16.02.2024 నుండి, దిగువ జాబితా చేయబడిన 12 ఫారాలు / దరఖాస్తులు సిపిసి వద్ద ప్రాసెస్ చేయబడతాయి, తరువాత 01.04.2024 నుండి ఇతర ఫారాలు ప్రాసెస్ చేయబడతాయి. తరువాత, ఎల్ ఎల్ పి చట్టం కింద దాఖలు చేసే ఫారాలు / దరఖాస్తులను కూడా కేంద్రీకృతం చేయాలని ప్రతిపాదించారు. ఫైలింగ్ ట్రెండ్స్ ఆధారంగా, ఇది పూర్తిగా అమలులోకి వచ్చిన తర్వాత సిపిసి ద్వారా ఏటా సుమారు 2.50 లక్షల ఫారాలను ప్రాసెస్ చేస్తారని భావిస్తున్నారు.

కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత ఇప్పటి వరకు 4,910 ఫారాలు సీపీసీకి అందాయి. ఫారాలు సమయానుకూలంగా, ముఖరహితంగా ప్రాసెస్ చేయబడతాయి. సిఆర్ సి, సి-పేస్ వద్ద దరఖాస్తుల ప్రాసెసింగ్ కు వాటాదారులతో ఎటువంటి భౌతిక ముఖాముఖి అవసరం లేదు.

సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్ సి), సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ ఫర్ యాక్సిలరేటెడ్ కార్పొరేట్ ఎగ్జిట్ (సి-పేస్), సిపిసిలు విలీనం, మూసివేత, నియంత్రణ అవసరాలను తీర్చడానికి దాఖలు చేసిన దరఖాసులు, ఫారాలను వేగంగా ప్రాసెసింగ్ చేసేలా చూస్తాయి, తద్వారా కంపెనీలు విలీనం చేయబడతాయి, మూసివేయబడతాయి, మార్చగలవు. మూలధనాన్ని సమీకరించగలవు. కార్పొరేట్ చట్టాల కింద వారి వివిధ షరతులను సులభంగా పూర్తి చేయగలవు. సిపిసి ఏర్పాటు తరువాత, న్యాయపరిధి గల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసి) పటిష్టమైన కార్పొరేట్ పాలనను నిర్ధారించడానికి విచారణలు, తనిఖీ, దర్యాప్తు వంటి వాటి ప్రధాన విధులపై మరింత దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

గత చాలా ఏళ్లుగా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సులభ వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) దిశగా పలు చర్యలు చేపట్టింది.

కంపెనీలను త్వరితగతిన విలీనం చేసే విషయంలో ప్రవేశాన్ని సులభతరం చేసే దిశగా తీసుకున్న చర్యలు ఇ ఒ డి బి లో ఒక ముఖ్యమైన భాగం. నాన్ ఎస్ టి పి (స్ట్రెయిట్ త్రూ ప్రాసెసింగ్) విధానంలో కంపెనీలు, ఎల్ ఎల్ పి ల కోసం దాఖలు చేసిన దరఖాస్తులను కేంద్రీకృతంగా, త్వరితగతిన, పారదర్శకంగా ప్రాసెసింగ్ చేసేందుకు సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సి ఆర్ సి సీ) ని ఏర్పాటు చేశారు. ఇది ఆశించిన ఫలితాలను ఇచ్చింది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో 1,02,063 కంపెనీలు, ఎల్ ఎల్ పి లు విలీనం కాగా, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 92 శాతం ఎక్కువగా 1,95,586 కంపెనీలు, ఎల్ ఎల్ పి లు విలీనమయ్యాయి.

# రేవుల పనితీరు మదింపు సూచిక 'సాగర్ ఆంకాలన్' మార్గదర్శకాలను విడుదల చేసిన శ్రీ సర్బానంద సోనోవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:రేవుల పనితీరు మదింపు సూచిక 'సాగర్ ఆంకాలన్' మార్గదర్శకాలను కేంద్ర రేవులు, జల మార్గాలు, షిప్పింగ్, ఆయుష్ శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ ఈరోజు విడుదల చేశారు. గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ (జీఎంఐఎస్ 2023) లో సంతకాలు చేసిన వివిధ అవగాహన ఒప్పందాలను అమలు లోకి తీసుకు వచ్చేందుకు సంబంధిత వర్గాలతో ఏర్పాటు చేసిన సమావేశం 'సాగర్ ఆంకాలన్' మార్గదర్శకాలను శ్రీ సర్బానంద సోనోవాల్ విడుదల చేశారు.

'సాగర్ ఆంకాలన్' మార్గదర్శకాల ప్రకారం దేశంలో అన్ని ఓడరేవుల పనితీరును మదింపు వేస్తారు. ఓడరేవుల రవాణా సామర్థ్యం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రమాణాల అమలు, పోటీతత్వం ఎక్కువ చేయడం, అభివృద్ధి, ఉత్పాదకత, సుస్థిరత, వినియోగదాలకు అందించిన సేవలు ఆధారంగా ఓడరేవుల పనితీరును మదింపు వేస్తారు.

జీఎంఐఎస్ 2023 లో కుదిరిన అవగాహన ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా అమలు చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ సంబంధిత వర్గాలతో సమావేశం నిర్వహించింది. అవగాహన ఒప్పందాల అమలుకు ఒక కార్యాచరణ ప్రణాళిక సింహం చేయాలని మంత్రిత్వ శాఖ నిర్ణయించింది.

సమావేశంలో పాల్గొన్న వారు వివిధ అమలుపై సుదీర్ఘంగా చర్చించి ఒప్పందాల అమలులో ఎదురవుతున్న సవాళ్లు గుర్తించి పరిష్కార మార్గాలను సూచించారు. సమావేశంలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాలు, పర్యాటక శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద వై. నాయక్, కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల సహాయ మంత్రి శ్రీ శాంతాను ఠాకూర్, కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఐఐటీ చెన్నైలో జీఎంఐఎస్ నివేదిక విడుదలతో పాటు డ్రెడ్జింగ్ టెక్నాలజీలో ఎంటెక్ కోర్సు ప్రారంభ కార్యక్రమం కూడా జరిగింది.

కార్యక్రమంలో మాట్లాడిన శ్రీ శ్రీ సర్బానంద సోనోవాల్ " సుస్థిర అభివృద్ధి సాధన కోసం జరుగుతున్న కృషిలో భాగంగా గ్లోబల్ మారిటైం ఇండియా సమ్మిట్ 2023 లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అమృత కాలంలో సముద్రయాన అభివృద్ధి ప్రణాళిక విడుదల చేశారు" అని తెలిపారు.

" సుస్థిర అభివృద్ధి, సాంకేతిక పురోగతి, సముద్ర మౌలిక సదుపాయాల పెంపుపై దృష్టి సారించి గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్ 2023 జరిగింది. దీనిలో పరిశ్రమ నాయకులు, విధానకర్తలు, వాటాదారుల మధ్య వ్యూహాత్మక చర్చలు జరిగాయి.. భారతదేశ విస్తారమైన సముద్ర తీరం, సముద్ర వనరుల సామర్థ్యాన్ని అందరికీ ప్రయోజనం చేకూర్చడానికి ఉపయోగించడం లక్ష్యంగా సదస్సు జరిగింది. " అని శ్రీ సోనోవాల్ అన్నారు.

ఒప్పందాలను సాకారం చేయడానికి, భారత సముద్రయాన రంగం మరింత అభివృద్ధి సాధించడానికి భాగస్వాములు కలిసి పనిచేయాలని మంత్రి కోరారు. అమృత్ కాల సమయంలో భారతదేశాన్ని 'వికసిత భారత్ ' గా అభివృద్ధి చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఆయన కోరారు.

# సుఫలామ్ 2024లో కీలక దశలో ఉన్న ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:ఫుడ్ ప్రాసెసింగ్ డొమైన్ లోని స్టార్టప్ లను స్థాపిత ఆహార వ్యాపారాలుగా మార్చడానికి ఫుడ్ ప్రాసెసింగ్ లోని వివిధ అంశాలలో ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు , అధునాతన సాంకేతికతలు కీలక చోదకాలు అనే సందేశంతో స్టార్టప్ ఫోరం ఫర్ ఆస్పైరింగ్ లీడర్స్ అండ్ మెంటర్స్ (సుఫలామ్) 2024 ముగిసింది.

2024, ఫిబ్రవరి-13,14 తేదీలలో న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కేంద్ర ఆహారశుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పశు పతి కుమార్ పరాస్ ప్రారంభించారు. వ్యవసాయ, రైతు సంక్షేమం, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సుశ్రీ శోభా కరంద్లాజే, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి అనితాప్రవీణ్, కుండ్లిలోని నిఫ్టెమ్ డైరెక్టర్ డాక్టర్ హరీందర్ ఒబెరాయ్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ మిన్హాజ్ ఆలం ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. స్టార్టప్ లు, ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీలు, ఎంఎస్ఎంఇ లు, ఆర్థిక సంస్థలు, వెంచర్ క్యాపిటలిస్టులు, విద్యావేత్తలతో సహా 250 మందికి పైగా వాటాదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో మూడు నాలెడ్జ్ సెషన్లు, రెండు పిచింగ్ సెషన్లు, రెండు ప్యానెల్ డిస్కషన్లు, నెట్వర్కింగ్ సెషన్లు, ఒక ఎగ్జిబిషన్ ఉన్నాయి.

స్టార్టప్ - అవలోకనం, ప్రయోజనాలపై నాలెడ్జ్ సెషన్ లో, స్టార్టప్ ఇండియా పాత్ర, స్టార్టప్ ఇండియా కింద మార్గదర్శకత్వం , ఆవిష్కరణల కోసం వివిధ కార్యక్రమాలు , భారతదేశంలో స్టార్టప్ ఎకోసిస్టమ్ ను పెంపొందించడానికి ఈ చొరవ ఎలా సహాయపడుతుందనే దాని గురించి వివరించారు. ఫుడ్ రెగ్యులేషన్స్ పై జరిగిన మరో నాలెడ్జ్ సెషన్ లో, ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ , ఇ ఐ సి నిబంధనలకు అనుగుణంగా వివిధ ఆహార ఉత్పత్తుల దేశీయ, దిగుమతి, ఎగుమతిలో వివిధ నిబంధనలు, ధృవీకరణలు, షరతులు గురించి స్పష్టమైన అవగాహన కల్పించారు. తాజా , ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించడానికి అపెడా కింద వివిధ పథకాల గురించి కొత్త అంతర్దృష్టులు, స్టార్టప్ లకు బిజినెస్ అండ్ ఫైనాన్షియల్ మోడలింగ్ వ్యాపారం, ప్రతి అంశంలో వయబిలిటీ సుస్థిరతను చూపించే వ్యాపార ప్రణాళికను రూపొందించడం గురించి, ఏ వ్యాపారంలో నైనా ఆర్థిక ప్రణాళికలో ఉచిత నగదు ప్రవాహం ప్రాముఖ్యత , సరైన నగదు ప్రవాహ నిర్వహణ గురించి స్టార్టప్ లకు వివిధ చిట్కాలు అందించారు.

ఆహార వ్యవస్థలను మార్చడంపై ప్యానెల్ చర్చ ముడి పదార్థాల వైవిధ్యం, ఆల్గే , చిరుధాన్యాలు వంటి వాతావరణ-స్థితిస్థాపక ఎంపికలు, వ్యవస్థాపకతలో సృజనాత్మకతపై దృష్టి సారించింది. ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా, సరఫరా గొలుసులను ఆప్టిమైజ్ చేయడానికి ప్రాసెసింగ్ యంత్రాలు, ముడి పదార్థాలు, వినూత్న అగ్రి-టెక్ పరిష్కారాల రూపకల్పన గురించి ప్రముఖంగా వివరించారు. ముడి పదార్థాల సోర్సింగ్ లో జోక్యం, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలు , స్థిరమైన ప్యాకేజింగ్ లో అవకాశాలను అన్వేషించడం, స్థిరమైన ఆవిష్కరణల కోసం సహకారం గురించి కూడా చర్చించారు.ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రెన్యూర్స్ కోసం స్టార్టప్ కాన్క్లేవ్ పై సెషన్ లో ఫుడ్ ఇన్నోవేషన్ హబ్ గా భారతదేశ సామర్థ్యం, పరిశ్రమలు, స్టార్టప్ లు, సంస్థల మధ్య సమన్వయం అవసరాన్ని ప్రముఖంగా చర్చించారు. వినియోగదారుల ప్రాధాన్యతలు , నిబంధనల ప్రమాణాలకు అనుగుణంగా స్థిరమైన ప్యాకేజింగ్ ప్రాముఖ్యతపై కీలక చర్చలు కేంద్రీకృతమయ్యాయి. నాణ్యమైన ముడి పదార్థాలను సోర్సింగ్ చేయడం, రైతులకు సహకరించడం, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారాలు, సరసమైన పోషకాహార ఆధారిత ఉత్పత్తుల్లోకి ప్రవేశించడంలో స్టార్టప్ లు క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. సుస్థిర ఆవిష్కరణల కోసం, ముఖ్యంగా క్రెడిట్ ఇన్నోవేషన్, పరిశ్రమల మధ్య భాగస్వామ్యం ద్వారా అన్ని రంగాల్లో సహకారానికి పెద్దపీట వేస్తూ సెషన్ ముగిసింది.

రెండు రోజులలో జరిగిన ఈ రెండు సమావేశాల్లో ఎంపిక చేసిన పన్నెండు స్టార్టప్ లు తమ ఆలోచనలను ఫుడ్ టెక్నాలజిస్టులు, ఎస్ బి ఐ , హెచ్ డీఎఫ్ సి బ్యాంక్ కు చెందిన టాప్ బ్యాంకింగ్ అధికారులు, వీసీలు, నిఫ్టెమ్ ఫ్యాకల్టీ, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్ తో కూడిన ప్యానెల్ కు వినిపించాయి. ప్రొడక్ట్ రిఫైన్ మెంట్, మార్కెట్ లింకేజీ, ఇన్వెస్టర్ కనెక్ట్ లో ఆరు స్టార్టప్ లకు మెంటరింగ్ సపోర్ట్ ఇచ్చారు. ప్యానలిస్టులు ఈ చొరవను స్వాగతించారు ఆశాజనకమైన చిన్న వెంచర్లకు సహాయం , మార్గదర్శకత్వం కోసం భవిష్యత్తు ప్రయత్నాలలో మద్దతును అందించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో 26 స్టార్టప్ లు, తొమ్మిది పిఎంఎఫ్ఎంఇ లబ్ధిదారులు, మూడు ప్రభుత్వ ఏజెన్సీలు సహా మొత్తం 38 ఎగ్జిబిటర్లు తమ ఉత్పత్తులు, పథకాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. స్టార్టప్ లు, పరిశ్రమల మధ్య వేర్వేరు నెట్ వర్కింగ్ సెషన్లు జరిగాయి, ఇందులో స్టార్టప్ లకు హ్యాండ్ హోల్డింగ్ టెక్నికల్ మద్దతు పై ప్రధానంగా చర్చలు జరిగాయి.సుఫలామ్ 2024 పరివర్తనాత్మక చర్చలకు, ఆవిష్కరణ-ఆధారిత వృద్ధి దిశగా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ గమనాన్ని రూపొందించ డానికి, స్టార్టప్ ల మధ్య, స్టార్టప్ లు, పరిశ్రమలు, విద్యావేత్తల మధ్య భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ఉత్ప్రేరకంగా పనిచేసింది,

# ఆపరేషన్ 'నన్హే ఫరిస్తే' కింద జనవరి 2024లో 549 మంది పిల్లలను తిరిగి కలిపిన ఆర్‌పిఎఫ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:రైల్వే ఆస్తులు, ప్రయాణీకుల ప్రాంతాలు మరియు ప్రయాణికుల శ్రేయస్సును పరిరక్షించడంలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పిఎఫ్) నిబద్ధతతో పనిచేస్తోంది. 2024 జనవరి నెలలో ఆర్పిఎఫ్ ప్రయాణీకుల భద్రత మరియు సౌకర్యాన్ని అందించడం కొనసాగించింది. అదే సమయంలో భారతీయ రైల్వే తన వినియోగదారులకు నమ్మకమైన సరుకు రవాణా సేవలను అందించడంలో సహాయం చేస్తుంది.

ఆపరేషన్ "నాన్హే ఫారిస్తే"- తప్పిపోయిన పిల్లలను రక్షించడం: మిషన్ "నాన్హే ఫారిస్టే" కింద సంరక్షణ మరియు రక్షణ అవసరమైన 549 కంటే ఎక్కువ మంది పిల్లలను వారి కుటుంబాలతో తిరిగి కలపడంలో ఆర్పిఎఫ్ కీలక పాత్ర పోషించింది. ఈ పిల్లలు వివిధ కారణాల వల్ల వారి కుటుంబాల నుండి వేరు చేయబడ్డారు మరియు వారు సురక్షితంగా ఇంటికి తిరిగి వెళ్లడానికి ఆర్పిఎఫ్ అవిశ్రాంతంగా పనిచేసింది.

ఆపరేషన్ "జీవన్ రక్ష"- ప్రాణాలను కాపాడటం: ఆర్పిఎఫ్ యొక్క అప్రమత్తమైన మరియు వేగవంతమైన చర్య 233 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడింది. వారు కదులుతున్న రైళ్లను ఎక్కినప్పుడు లేదా దిగుతున్నప్పుడు ప్రమాదవశాత్తు పడిపోయారు. అయితే జనవరి 2024లో ఆపరేషన్ 'జీవన్ రక్ష'లో ఆర్పిఎఫ్ సిబ్బంది అప్రమత్తతతో చక్రాల క్రింద, ప్లాట్‌ఫారమ్‌లు మరియు రైల్వే ట్రాక్‌ల వద్ద చిక్కుకోకుండా తృటిలో తప్పించుకున్నారు.

మహిళా ప్రయాణీకులకు సాధికారత - "మేరీ సహేలి" చొరవ: ఆర్పిఎఫ్ మహిళా ప్రయాణీకుల భద్రతను ప్రధానంగా పరిగణిస్తుంది. మరియు "మేరీ సహేలి" చొరవను ప్రారంభించింది. జనవరి 2024 నెలలో 229 "మేరీ సహేలి" బృందాలు 13,615 రైళ్లలో ప్రయాణిస్తూ 4.1 లక్షల మంది మహిళా ప్రయాణీకులకు భద్రతా హామీని అందించారు. మహిళా ప్రయాణికుల కోసం కేటాయించిన కోచ్‌లలో ఇతర ప్రయాణికులను గుర్తించి 7402 మందిపై ఆర్పిఎఫ్ చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంది.

టౌట్స్‌పై క్రాకింగ్ డౌన్ (ఆపరేషన్ "ఉప్లబ్ద్"): టౌట్‌లకు వ్యతిరేకంగా పోరాటంలో ఆర్పిఎఫ్ జనవరి 2024 నెలలో 379 మంది వ్యక్తులను అరెస్టు చేసింది మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంది. అంతే కాకుండా వారు రిజర్వు చేసిన రైల్వే టిక్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 44.46 లక్షలు.

ఆపరేషన్ "నార్కోస్" - మాదకద్రవ్యాల నేరాలను ఎదుర్కోవడం: ప్రశంసనీయమైన ప్రయత్నంలో ఆర్పిఎఫ్ 2024 జనవరి నెలలో 76 మంది వ్యక్తులను అరెస్టు చేసింది మరియు వారినుండి మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. వాటి విలువ రూ. 4.13 కోట్లు. ఈ నేరస్థులు తదుపరి చట్టపరమైన చర్యల కోసం ప్రభుత్వ ఏజెన్సీలకు అధికారం అప్పగించారు.

ప్రయాణీకుల సమస్యలకు సత్వర స్పందన: రైల్ మదద్ పోర్టల్ మరియు హెల్ప్‌లైన్ (నెం. 139 ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ నం. 112తో అనుసంధానం చేయబడింది) ద్వారా భద్రతకు సంబంధించిన ప్రయాణీకుల ఫిర్యాదులను ఆర్పిఎఫ్ వెంటనే పరిష్కరించింది. జనవరి 2024 నెలలో 19,738 ఫిర్యాదులు అందాయి. వాటిని పరిష్కరించడానికి అవసరమైన చర్యలు ఆర్పిఎఫ్ తీసుకుంది.

ఆపరేషన్ "యాత్రి సురక్ష" - ప్రయాణీకులను రక్షించడం: రైల్వే ప్రయాణీకులపై నేరాలను నిరోధించడంలో మరియు గుర్తించడంలో పోలీసుల ప్రయత్నాలకు ఆర్పిఎఫ్ అనుబంధంగా ఉంటుంది. జనవరి 2024లో ప్రయాణీకులపై నేరాలకు పాల్పడిన 225 మంది నేరస్థులను ఆర్పిఎఫ్ అరెస్టు చేసింది. వారిపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వారిని సంబంధిత జీఆర్పి/పోలీసులకు అందించింది.

"ఆపరేషన్ సంరక్ష" ద్వారా భద్రతను నిర్ధారించడం: ప్రయాణీకుల భద్రతను నిర్వహించడానికి మరియు రైల్వే సేవలను రక్షించడానికి ఒక దృఢమైన ప్రయత్నంలో 2024 జనవరిలో నడుస్తున్న రైళ్లపై రాళ్ల దాడికి పాల్పడిన 53 మంది వ్యక్తులను ఆర్పిఎఫ్ అరెస్టు చేసింది.

అవసరమైన వారికి సహాయం చేయడం (ఆపరేషన్ సేవ): మానవతా దృక్పథంతో జనవరి 2024 నెలలో రైలు ప్రయాణాల్లో 227 మంది వృద్ధులు, అనారోగ్యం లేదా గాయపడిన ప్రయాణికులకు ఆర్పిఎఫ్ సహాయం అందించింది.

అక్రమ వస్తువుల రవాణాను అరికట్టడం (ఆపరేషన్ సతార్క్): "ఆపరేషన్ సతార్క్" కింద జనవరి 2024 నెలలో, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పిఎఫ్) అక్రమ పొగాకు ఉత్పత్తులను మరియు రూ.30.15 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుంది. 86 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ వ్యక్తులను తదనంతరం సంబంధిత ప్రభుత్వ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు అప్పగించారు. ఆపరేషన్ సమయంలో అదనంగా లెక్కల్లో చూపని నగదు రూ. 1.53 కోట్లు, బంగారం విలువ రూ. 37.18 లక్షలు, వెండి విలువ రూ.11.67 లక్షలు కూడా స్వాధీనం చేసుకున్నారు.

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తన అంకితభావంతో కూడిన సిబ్బంది మరియు ప్రయాణీకులందరికీ సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందించడానికి దాని లక్ష్యం, సమగ్రత, మరియు బాధ్యత విలువలను సమర్థిస్తూ రైల్వే భద్రతలో ముందంజలో ఉంది.

# శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించేందుకు 150 మంది విద్యార్థులకు సైంటిఫిక్ విహారయాత్ర నిర్వహించిన సిఎస్ఐఆర్-ఐఐసీటీ, కేపీఎంపీ




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:నాలెడ్జ్ అండ్ అవేర్ నెస్ మ్యాపింగ్ ప్లాట్ ఫామ్ నిర్వహించిన సైంటిఫిక్ విహారయాత్రలో భాగంగా తెలంగాణలో హైదరాబాద్ లో ఉన్న సీఎస్ ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీని హైదరాబాద్ రమాదేవి పబ్లిక్ స్కూల్, హకీంపేట పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం కు చెందిన 150 మంది విద్యార్థులు సందర్శించారు.

విద్యార్థులకు శాస్త్రీయ అన్వేషణ, ఆవిష్కరణల పట్ల అభిరుచి పెంపొందించడం లక్ష్యంగా ఈ విహారయాత్రను నిర్వహించారు. ఈ విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక, నూతన ఆవిష్కరణలకు సంబంధించిన అనేక అంశాలపై అవగాహన పొందారు.

తన బృందం సభ్యులతో కలిసి డాక్టర్ వత్సల రాణి (ప్రిన్సిపల్ సైంటిస్ట్ మరియు సిఎస్ఐఆర్-జిగ్యాస కోఆర్డినేటర్, సిఎస్ఐఆర్-ఐఐసిటి, హైదరాబాద్) విద్యార్థులకు శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించారు. చర్చలు, ల్యాబ్ సందర్శనల ద్వారా విద్యార్థులకు శాస్త్రీయ అంశాలపై స్ఫూర్తి కల్పించారు. ప్రయోగశాలలో, విద్యార్థులు వాయురహిత గ్యాస్ లిఫ్ట్ రియాక్టర్ టెక్నాలజీ, వాటర్ ప్యూరిఫికేషన్ టెక్నాలజీ , ఫెరోమోన్ టెక్నాలజీకి సంబంధించి అనేక కొత్త విషయాలను స్వయంగా పరిశీలించి అవగాహన పొందారు.

విహారయాత్రకు సహకరించి, విద్యార్థులకు శాస్త్రీయ అంశాలు వివరించిన డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి (డైరెక్టర్, సిఎస్ ఐఆర్-ఐఐసిటి), డాక్టర్ వత్సల రాణి (ప్రిన్సిపల్ సైంటిస్ట్ మరియు సిఎస్ ఐఆర్-జిగ్యాస కోఆర్డినేటర్, సిఎస్ ఐఆర్-ఐఐసిటి, హైదరాబాద్)లకు శ్రీ అనికేత్ అరోరా (ఔట్ రీచ్ కోఆర్డినేటర్, కెఎమ్పి) , , కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను కూడా ఆయన ప్రస్తావించారు. భారతదేశంలో సైన్స్, ఇతర పరిణామాలపై విద్యార్థుల లోతైన ఆసక్తి, అవగాహన పెంపొందించడానికి కెఎంపి చేస్తున్న కృషిని శ్రీ అనికేత్ అరోరా వివరించారు.

విద్యార్థులకు అనుభవపూర్వక అభ్యాసం కీలకమని ఆయన అన్నారు. భవిష్యత్తులో చేపట్టనున్న వివిధ కారయక్రామాలను ఆయన వివరించారు. భారతదేశంలోని వివిధ ప్రసిద్ధ సిఎస్ఐఆర్ ప్రయోగశాలలు / పరిశోధనా సంస్థలలో వివిధ శాస్త్రీయ విభాగాలను ఉపాధ్యాయులకు ఆన్లైన్ నాలెడ్జ్ షేరింగ్ సెషన్లు, విద్యార్థులకు శాస్త్రీయ విహార యాత్రలు, నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి వంటి కార్యకలాపాలు చేపడతామని ఆయన విద్యార్థులకు తెలియజేశారు.

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) పరిధిలో పనిచేస్తున్న జాతీయ ప్రయోగశాలల్లో కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ - ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సిఎస్ఐఆర్-ఐఐసిటి) ఒకటి. క్రియాశీలక సంస్థగా గుర్తింపు పొందిన ,సీఎస్ఐఆర్-ఐఐసీటీ తన డెబ్బై ఏళ్ల ప్రయాణంలో అనేక ఆవిష్కరణలు అభివృద్ధి చేసి ప్రముఖ పరిశోధన, అభివృద్ధి సంస్థగా గుర్తింపు పొందింది. ప్రపంచం వివిధ ప్రాంతాలకు చెందిన సంస్థలకు సిఎస్ఐఆర్-ఐఐసిటి సేవలు అందిస్తోంది. భారతదేశంలో రసాయన, బయోటెక్ పరిశ్రమలకు సిఎస్ఐఆర్-ఐఐసిటి సేవలు అందిస్తోంది.

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సిఎస్ఐఆర్) - నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ కమ్యూనికేషన్ అండ్ పాలసీ రీసెర్చ్ (ఎన్ఐఎస్పిఆర్), పారిశ్రామిక భాగస్వామి వెంసర్స్ నైసా కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్సిపిఎల్) కలిసి నాలెడ్జ్ అండ్ అవేర్నెస్ మ్యాపింగ్ ప్లాట్ ఫామ్ ను నిర్వహిస్తున్నాయి.

విద్యార్థుల అంతర్లీన సామర్థ్యాలను వెలికితీసే సృజనాత్మకత, అర్థవంతమైన అభ్యాసం, విమర్శనాత్మక పఠనం, ఆలోచనా నైపుణ్యాలు అభివృద్ధి చేయడం లక్ష్యంగా నాలెడ్జ్ అండ్ అవేర్నెస్ మ్యాపింగ్ ప్లాట్ ఫామ్ కార్యక్రమాలు అమలు చేస్తోంది.

# మహిళా పథకం వల్ల మున్సిపల్ సిబ్బందికి జీతాలు అందడం లేదు: ఇండోర్ మేయర్

భోపాల్, ఫిబ్రవరి 17: మహిళా పథకం వల్ల మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి జీతాలు అందడం లేదని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ మేయర్ (ఎనిటనీతీవ ఓజీఎనీతీ), బీజేపీ నాయకుడు పుష్యమిత్ర భార్గవ ఆరోపించారు. ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు ప్రతి నెలా రూ.1250 ఇచ్చే లాడ్లీ బెహనా యోజన వల్ల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి గత ఆరు నెలలుగా జీతాలు అందలేదని మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో అన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి గ్రాంట్లు తక్కువగా వస్తున్నాయని, మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.850 కోట్ల అప్పులు ఉన్నాయని వెల్లడించా రు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

కాగా, ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని నరేంద్ర మోదీపై మండిపడింది. 'లాడ్లీ బెహనా యోజన కారణంగా ఉద్యోగులు తమ జీతాలు పొందడం లేదని ఇండోర్ మేయర్ అంగీకరించారు. మిస్టర్ మోదీ, మీకు ఓట్లు మించి ఏమీ కనిపించదు' అని ఎక్స్‌లో విమర్శించింది.

# క్రెడిట్ కార్డు బిల్లు కట్టలేక దంపతుల ఆత్మహత్య

హైదరాబాద్, ఫిబ్రవరి 17:క్రెడిట్ కార్డు బిల్లు కట్టలేక దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. జిల్లాలోని కీసర పీఎస్ పరిధిలో ఈ ఘటన జరిగింది.

సురేష్ కుమార్, అతని భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. తమ పిల్లలను తమ అమ్మమ్మ గారి ఇంటికి పంపి భార్య భర్తలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

# వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభం : చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 17: ఏపీలో వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. మరో 52 రోజుల తర్వాత టీడీపీ, జనసేన ప్రభుత్వం వస్తుందని ధీమాను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అభ్యర్థులు దొరక్క సందిగ్ధంలో పడ్డారని పేర్కొన్నారు.

బావట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లు నిర్వహించిన 'రా కదలి .. రా' బహిరంగ సభలో బాబు మాట్లాడారు.

రాజకీయాలను కలుషితం చేసి వ్యక్తి జగన్ చిల్లర రాజకీయాలు మానుకుని గౌరవంగా రాజకీయాలు చేయడం నేర్చుకో సూచించారు. ఆర్టీసీ బస్సు ల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సంపద సృష్టించి ఏపీ ప్రజలకు బంగారు భవిష్యత్‌ను అందిస్తానని అన్నారు.

జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి నియమకాలను చేపడుతామని, నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించేంతవరకు మూడువేల రూపాయలు అందిస్తానని అన్నారు. నాకు విజన్, జగన్‌కు జైలుకు పోవడం తెలుసని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాజకీయ రౌడీలకు ఖబడ్దారంటూ హెచ్చరించారు. వాలంటీర్ల వ్యక్తులకు వ్యతిరేకం కాదు. ప్రజలకు సేవ చేస్తే అభినందిస్తా .కాని జగన్‌కు సేవలం దిస్తే సహించబోమని అన్నారు.

# రేపటితో బుక్ ఫెయిర్ ఆఖరు




హైదరాబాద్, ఫిబ్రవరి 17:ఎల్లుండితో బుక్ ఫెయిర్ ముగియనున్నది. ఇప్పటికే పుస్తక ప్రేమికులు ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన పుస్తక ప్రదర్శనలో వారికి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తూ సందడి చేస్తున్నారు. శుక్రవారం రవ్వా శ్రీహరి వేదికపై పలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. 'యువతరం కవులు అంతరంగ ఆవిష్కరణ' అంశంపై నేటితరం యువ కవులతో చర్చా కార్యక్రమం జరిగి ంది. జీవితం లేకుండా కవిత్వం లేదని కాళోజీ అవార్డు గ్రహీత అమ్మంగి వేణుగోపాల్ అన్నారు.సాహిత్యంలోని అన్ని ప్రక్రియల ద్వారా యువతరం, నవతరం కవులు గళమెత్తాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసేన్, గౌరీ శంకర్, కవి యాకూబ్, నారాయణరెడ్డి, చరణ్, రాము, కల్యాణి, శ్రీనిధి విప్లవ శ్రీ, అనూష తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాల వికాస్ కార్యక్రమంలో భాగంగా చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాటలు, పద్యాల పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం మిస్టర్ చోగా పేరుగాంచిన ప్రముఖ బాల సాహితీవేత్త చొక్కాపు వెంకట రమణ ప్రదర్శించిన ఫన్నీ మ్యాజిక్ షో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ ప్రదానం చేశారు.

# 'పీఎం స్వనిధి' పథకం వీధి వ్యాపారుల గౌరవాన్ని నిలబెట్టింది: గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పురి




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17:ఢిల్లీలో 'పీఎం స్వనిధి' మెగా క్యాంప్ నిర్వహించి 10,000 మంది వీధి వ్యాపారులకు రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన గృహ నిర్మాణం ఌ పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పురి, కరోనా మహమ్మారి కారణంగా దేశంలోని వీధి వ్యాపారులు అత్యంత తీవ్రంగా ప్రభావితమైన సమయంలో 'పీఎం స్వనిధి' పథకం ప్రారంభమైందని చెప్పారు. అది, వీధి వ్యాపారుల గౌరవాన్ని కాపాడిందని, వేరొకరి మీద ఆధారపడకుండా వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేసిందని అన్నారు.ఈ రోజు ఇక్కడ జరిగిన 'పీఎం స్వనిధి' మెగా క్యాంపులో 10 వేల మంది వీధి వ్యాపారులకు రుణాలు పంపిణీ చేశామని కేంద్ర వివరించారు.ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా, ఆర్థిక శాఖ సహాయ మంత్రి శ్రీ భగవత్ కిషన్‌రావ్ కరాడ్, విదేశీ వ్యవహారాలు ఌ సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి శ్రీమతి మీనాక్షి లేఖి, ఢిల్లీ ఎంపీ డా.హర్షవర్ధన్ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.పీఎం స్వనిధి పథకం విజయాల గురించి కేంద్ర మంత్రి వివరించారు. ఈ పథకం ద్వారా 60.94 లక్షల మంది వీధి వ్యాపారులకు రూ.10,678 కోట్ల విలువైన 80.42 లక్షల రుణాలు అందజేసినట్లు చెప్పారు. తొలి విడతలో, ఎలాంటి తనఖా లేకుండా రూ.10,000 వరకు రుణం, ఆ తర్వాత రెండు ఌ మూడు విడతల్లో వరుసగా రూ.20,000 ఌ రూ.50,000 చొప్పున రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పథకం వల్ల వీధి వ్యాపారులు ఆర్థిక వ్యవస్థలో భాగం కావడమేగాక, వారి గౌరవం పెరిగిందన్నారు. "ఇప్పుడు, వీధి వ్యాపారులు అధిక వడ్డీ చెల్లించే అనధికార రుణ మార్గాలపై ఆధారపడరు. ప్రభుత్వం వారికి ప్రత్యామ్నాయ మార్గాన్ని తెరిచింది" అని శ్రీ పురి చెప్పారు.

ఢిల్లీలోని వీధి వ్యాపారులకు కూడా ఈ పథకం ద్వారా అవసరమైన సాయం అందించినట్లు మంత్రి హర్దీప్ సింగ్ పురి వెల్లడించారు. 14 ఫిబ్రవరి 2024 నాటికి, ఢిల్లీలోని వీధి వ్యాపారుల నుంచి 3.05 లక్షల రుణ దరఖాస్తులు అందాయని, వాటిలో 2.2 లక్షల దరఖాస్తులకు బ్యాంకులు రుణం చేశాయని, మరో 1.9 లక్షల రుణాలు రూపంలో ఇప్పటికే రూ. 221 కోట్లు పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ రోజు మెగా క్యాంప్‌లో 10,000 రుణాల పంపిణీతో, ఒక్క ఢిల్లీలోనే 2 లక్షల రుణాల పంపిణీ మైలురాయిని దాటినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

# వేల్పుల విజేతను అభినందించిన కలెక్టర్



ఖమ్మం, ఫిబ్రవరి 17:(నేటినిజం ప్రతినిధి): శుక్రవారం విడుదల చేసిన ఎంపీహెచ్ డబ్ల్యు ఫలితాల్లో స్థానిక మహిళా ప్రాంగణం నుండి రాష్ట్ర స్థాయిలో 2వ, 4వ ర్యాంకులు సాధించిన విద్యార్థులు బైరం రచన, సాలవాడి మనీల లను నూతన కలెక్టరేట్ లో శనివారం జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అభినందించారు. జిల్లా స్థాయిలో మొదటి పది ర్యాంకులు కూడా మహిళా ప్రాంగణం విద్యార్థులే కైవసం చేసుకోవడాన్ని కలెక్టర్ ప్రశంసించారు. విద్యార్థులు ఈ విజయాన్ని అందుకోవడానికి అన్ని సౌకర్యాలు కల్పించి, మంచి విద్యా వసతులు కలుగచేసిన జిల్లా ప్రాంగణం అధికారిణి వేల్పుల విజేతను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణం విద్యార్థినులు, సిబ్బంది నాగ సరస్వతి, స్పందన, మల్లిక, హిమాబిందు, రమేష్, విజయ్ కుమార్, సుకన్య, లాలయ్య తదితరులున్నారు.

# తమిళనాడులో పీచు మిఠాయిపై నిషేధం..

చెన్నై, ఫిబ్రవరి 17: పీచు మిఠాయి.. ఈ పేరు వినగానే పిల్లలు ఎగిరి గంతులేస్తారు. పెద్దలు కూడా ఈ మిఠాయిని తినేందుకు ఆసక్తి చూపుతారు. అలా నోట్లో వేసుకోగానే కరిగిపోతోంది పీచు మిఠాయి. పిల్లల నుంచి పెద్దల వరకు ఎంతో ఇష్టపడే ఈ పీచు మిఠాయిపై తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు వ్యాప్తంగా పీచు మిఠాయి విక్రయాలపై నిషేధం విధిస్తున్నట్లు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సుబ్రమణియన్ వెల్లడించారు. పీచు మిఠాయి తయారీకి ఉపయోగించే వాటిలో క్యాన్సర్ కారక రసాయనాలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలిందని, అందుకే దీన్ని నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు.

పరిశోధనల్లో భాగంగా పీచు మిఠాయిల్లో రోడమైన్-బీ అనే కెమికల్‌ను గుర్తించారు. కృత్రిమ రంగుల కోసం దీన్ని పీచు మిఠాయిల్లో వినియోగిస్తున్నట్లు తేలింది. సాధారణంగా ఈ రోడమైన్ బీని ఇండస్ట్రియల్ డైగా పిలుస్తారు. దీన్ని ఎక్కువగా దుస్తుల కలరింగ్, పేపర్ ప్రింటింగ్‌లో వినియోగిస్తారు. ఫుడ్ కలరింగ్ కోసం దీన్ని ఉపయోగించడం వల్ల దీర్ఘకాలంలో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. రోడమైన్-బీ అనే కెమికల్ మన శరీరంలోకి వెళ్తే.. కిడ్నీ, లివర్ పనితీరుపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. అంతేకాకుండా అల్సర్ వంటి సమస్యలతో పాటు క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ఈ క్రమంలో తమిళనాడులో పీచు మిఠాయిపై నిషేధం విధించారు. పీచు మిఠాయి తయారీ, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆరోగ్య శాఖ మంత్రి హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి సుబ్రమణియన్ ఆదేశించారు.

# పోలీస్ శాఖ, రోడ్ రవాణా శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ మేళ

## -యువతి, యువకులకు జిల్లా ఎస్పీ లర్నింగ్ లైసెన్స్‌లు అందజేత

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 17:(నేటినిజం ప్రతినిధి): రాజన్న



సిరిసిల్ల జిల్లాలో డ్రైవింగ్ వచ్చిన ప్రతి ఒక్కరికి లైసెన్స్ ఉండాలనే ఉద్దేశ్యంతో దశల వారిగా గ్రామీణ ప్రాంత యువతి, యువకులకు జిల్లా పోలీస్ శాఖ, రోడ్ రవాణా శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ మెళ నిర్వహించి, లైసెన్స్ అందజేయనున్నట్టు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామలల్లో లైసెన్స్ మెళ నిర్వహించి, వారి వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించి, వారికి డ్రైవింగ్ లైసెన్సు కి సంబంధించిన ఆన్లైన్ పరీక్షపై అవగాహన కల్పించి, 50 మంది యువతి యువకులకు శనివారం రోజున ఆర్టీవో కార్యాలయంలో జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈరోజుల్లో ద్విచక్ర వాహనం లేని ఇల్లు లేదని, వాహనం ఉన్నా చాలా మంది డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనం నడిపేవారికి రోడ్డు భద్రతపై అవగాహన సరిగా లేకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాల భారిన పడినప్పుడు వారికి వచ్చే వారికి వచ్చే ప్రమాద భీమా వర్తించదన్నారు. జిల్లాలో డ్రైవింగ్ వచ్చిన వారికి లైసెన్స్ ఉండాలనే ఉద్దేశ్యంతో దశల వారిగా గ్రామీణ ప్రాంత యువతి, యువకులకు జిల్లా పోలీస్ శాఖ, జిల్లా రోడ్ రవాణా శాఖ ఆధ్వర్యంలో లైసెన్స్ మెళ నిర్వహించి, లైసెన్స్ లు అందజేయడం జరుగుతుందన్నారు.

మొదటి దశలలో రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో లైసెన్స్ మెళపై అవగాహన కల్పించగా 50 దరఖాస్తులు రావడం జరిగిందని, వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఆన్లైన్ టెస్ట్ కి సబధించిన పరీక్ష పై అవగాహన కల్పించి, జిల్లా పరిధిలోని ఆర్టీవో కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్ కి లర్నింగ్ టెస్ట్ సంబంధించిన పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత పొందిన 50 మందికి లర్నింగ్ లైసెన్స్ కు అందజేయడం జరిగిందని తెలిపారు. త్వరలో డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించి, డ్రైవింగ్ లైసెన్స్ లు అందజేయడం జరుగుతున్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీలు ఉదయ్ రెడ్డి, నాగేంద్రచరి, సిఐ కిరణ్ కుమార్, ఎంవీఐ కిషోర్, ఎస్ఐ అశోక్ సిబ్బంది, యువతి యువకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆప్ ఎమ్మెల్యేకు తీవ్ర గాయాలు

చండీఘుర్, ఫిబ్రవరి 17: పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆప్ ఎమ్మెల్యే కరంబీర్ సింగ్‌తో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆప్ ఎమ్మెల్యే ప్రయాణిస్తున్న కారు ఘోగ్రా గ్రామానికి సమీపంలో ఓ కరెంట్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఎమ్మెల్యేకు తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మెల్యే కరంబీర్ హోషియాపూర్ జిల్లాలోని దసుయా నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఎమ్మెల్యే తల్వారా పట్టణానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యేతో పాటు ఆయన వ్యక్తిగత సహాయకుడు శుభం, గన్‌మెన్ అమృత్ దీప్ సింగ్, డ్రైవర్ జస్పా సింగ్, మరో వ్యక్తి దల్జీత్ సింగ్ గాయపడ్డారు. క్షతగాత్రులను దసుయాలోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యేతో పాటు మిగతా వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

# ఘనంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు

## -రాజన్నకు బీఆర్ఎస్ నేతల ప్రత్యేక పూజలు

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 17:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ



పట్టణంలో తెలంగాణ ప్రదాత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ నియోజకవర్గ పార్టీ ఇంచార్జీ చల్మెడ లక్ష్మీనరసింహారావు నాయకత్వంలో రాజన్న సన్నిధిలో స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజన్న ఆలయం ముందు కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ రామతీర్థం మాధవి, పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పొలాస నరేందర్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, జోగిని శంకర్, యాచమనేని శ్రీనివాసరావు, నరాల శేఖర్, గోలి మహేశ్, కో ఆప్షన్ సభ్యులు బబూన్, నాయకులు రామతీర్థపు రాజు, కొండ కనకయ్య, కొండ నరసయ్య, సలీం, కందుల క్రాంతి కుమార్, కుమ్మరి శ్రీనివాస్ ముద్రకోల వెంకటేశం, మల్లేశం, వెంకట్ రెడ్డి, కమలాకర్ రెడ్డి, వెంగళ శ్రీకాంత్ గౌడ్, పోతు అనిల్ కుమార్, వాసాల శ్రీనివాస్, అంజత్ పాషా, అక్రమ పాషా, హింగే కుమార్, లైశెట్టి మల్లేశం, భాస్కర్ రావు, పెంట బాబు, దేవరాజు, బత్తుల మహేందర్ యాదవ్, పెరుమండ్ల రవిచందర్ గౌడ్, లిక్కడీ మహేందర్, ఇబ్రాహీం, కర్ల శేఖర్ తదితరులు ఉన్నారు.

# విశాఖలో ఐపీఎల్ మ్యాచ్‌లు.. 40 వేల సీట్ల కెపాసిటీతో స్టేడియం !



అమరావతి, ఫిబ్రవరి 17:ఆంధ్రలో ఈ ఏడాది మార్చి నెల ఆఖరులో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్ నిర్వహించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్ రెడ్డి వెల్లడించారు. ఇవ్వాల (శనివారం) విజయవాడలోని ఒక హోటల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్.ఆర్. గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. మ్యాచ్ నిర్వహణకు సంబంధించి ఐపీఎల్ టీమ్ సభ్యులు చర్చలు జరుపుతున్నారని అన్నారు.

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పి. శరత్ చంద్రారెడ్డి నాయకత్వంలో ఆంధ్ర నుంచి అంతర్జాతీయ క్రికెటర్లను తయారు చేయడమే లక్ష్యంగా పని వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాము. ఇందుకోసం ఇండియా మాజీ కెప్టెన్ రవి శాస్త్రి, ఇండియా మాజీ ప్లేయర్ శేఖర్ భరత్ తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఆంధ్ర క్రికెటర్లు దేశ జట్టుకు ఎంపిక కావడమే లక్ష్యంగా ప్రతిభ ఉన్న క్రికెటర్లను గుర్తించి ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలో ప్రత్యేక శిక్షణ ఇస్తామని వీటికోసం ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు.

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్ – 1, 2ను దిగ్విజయంగా నిర్వహించాము. తద్వారా ప్రతిభ ఉన్న ఎంతో మంది యువ క్రికెటర్లు వెలుగులోకి వచ్చారని అన్నారు. ఏపీఎల్ – 2 మ్యాచ్ ను స్టార్ స్పోర్ట్స్ లో లైవ్ ఇవ్వడం వల్ల 40 లక్షల మంది వీక్షించారని తెలిపారు. అదేవిధంగా ఉమెన్ ఏపీఎల్ ను దేశంలోనే మొట్ట మొదటి సారిగా ఆంధ్రలో విజయవంతంగా నిర్వహించామని అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ దేశంలో ఉమెన్ ప్రీమియర్ లీగ్ నిర్వహించారని తెలిపారు.

అదేవిధంగా ఏసీఏ సిబ్బంది, క్రీడాకారుల కోసం గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని స్కూళ్ల పరిధిలో లీగ్ నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని అన్నారు. దాదాపు 400 మంది క్రీడాకారుల పౌష్టికాహారం కోసం ఏడాదికి రూ. 1.50 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ఈ విధానాన్ని దేశంలోనే మొట్ట మొదటి అమలు చేస్తున్న రాష్ట్రం మనదే అని అన్నారు. వైజాగ్ లో 40 వేల సీట్ల కెపాసిటీతో కొత్తగా అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను నిర్మించనున్నట్లు తెలిపారు. నాలుగేళ్లలో క్రికెట్ కోసం సాధించిన అభివృద్ధి, విజయవంతంగా టీ – 20, వన్డే, టెస్టు మ్యాచ్ లు నిర్వహణ తదితర వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ కౌన్సిల్ సభ్యులు కె.వి.పురుషోత్తం, ఎన్. గీత, ఏసీఏ సీఈవో డా. ఎం.వి. శివారెడ్డి, గేమ్ డెవలప్మెంట్ జీఎం ఎం.ఎస్.కుమార్, సీనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఆర్.వి. చంద్రమౌళి చౌదరి, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మే నెల ఆర్జిత సేవలు, స్పెషల్ దర్శనం టికెట్ల విడుదల తేదీలు ఇవే..!

తిరుపతి, ఫిబ్రవరి 17:తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం శుభవార్త చెప్పింది. మే నెలకు సంబంధించిన ఆర్జిత సేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం, అంగ ప్రదక్షిణం, వసతి గదుల కోటా విడుదలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. మే నెలకు సంబంధించిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల ఆన్ లైన్ లక్కీడిప్ కోసం రిజిస్ట్రేషన్ ఈ నెల 19న ఉదయం గంటల ప్రారంభమవుతుందని పేర్కొంది.

21వ తేదీ ఉదయం 10 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని టీటీడీ తెలిపింది. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు లక్కీడిప్‌లో టికెట్ల పొందిన భక్తుల జాబితా విడుదల చేయనున్నది. లక్కీడిప్‌లో టికెట్ల పొందిన వారు డబ్బులు చెల్లించి టికెట్లను ఖరారు చేసుకోవాలని టీటీడీ పేర్కొంది. ఇక కల్యాణం, ఆర్జిత బ్రహోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్ల కోటాను ఈ నెల 22న విడుదల ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నట్లు దేవస్థానం బోర్డు పేర్కొంది.

శ్రీవారి వర్చువల్ సేవా టికెట్లను 22న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నది. అంగప్రదిక్షణం టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు తెలిపింది. శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనం, గదుల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేస్తామని చెప్పింది. మే నెలకు సంబంధించిన వృద్ధులు, దివ్యాంగులు, దర్శన టికెట్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొంది.

మే మాసానికి సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌ల విడుదల చేయనున్నట్లు పేర్కొంది. అలాగే తిరుమలతో పాటు తిరుపతిలో వసతి గదుల బుకింగ్‌ను అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నట్లు టీటీడీ వివరించింది. ఈ విషయాన్ని గమనించిన భక్తులు ఆన్‌లైన్‌లో టికెట్లను బుక్ చేసుకొని సహకరించాలని తిరుమల తిరుపతి దేవస్థానం కోరింది.

# రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్షిఫ్ కు అల్ఫోర్స్ విద్యార్థిని ఎంపిక



కరీంనగర్, ఫిబ్రవరి 17: (నేటినిజం ప్రతినిధి) అల్ఫోర్స్ ఐఐటి అకాడమిలో గత సంవత్సరం చదివిన కుమారి రామంచ సుమసిత అత్యుత్తమ ర్యాంకుతో ఎన్ఐటి వరంగల్ లో బిటెక్ కంప్యూటర్ సైన్స్ లో అడ్మిషన్ పొందగా, ప్రతి సంవత్సరం రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా ఇవ్వబడే స్కాలర్షిప్ ఇండియన్స్ బ్రైటేష్ట్ యూవర్ 2 లక్షల స్కాలర్షిఫ్కి ఎంపికైంది. ఈ సందర్భంగా రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్షిఫ్ కు రామంచ సుమసిత ఎంపిక కావడం అభినందనీయమని అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ గౌరవనీయులైన డాక్టర్ వి నరేందర్ రెడ్డి ఒక ప్రకటలో తెలిపారు.

# ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు



ఖమ్మం, ఫిబ్రవరి 17:(నేటనిజం ప్రతినిధి): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, అభివృద్ధి ప్రధాత, బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు వేడుకలు తెలంగాణ భవన్ లో జరిగాయి.మహానేత కేసీఆర్ 70ఏళు పూర్తి చేసుకుని 71ఏటా అడుగుపెటట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో జరిగిన వేడుకలకు ఆయన కుమారుడు కేటీఆర్ ముఖ్య అతిథిగా, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు, ఎంపీలు రంజిత్ రెడ్డి,బీబీపాటిల్, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వీ.శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీలతో కలిసి అతిథిగా హాజరయ్యారు. వారంతా కలిసి కేటీఆర్ చేత భారీ కేక్ కట్ చేయించారు, పలువురు దివ్యాంగులకు వీల్ ఛైర్లు పంపిణీ చేశారు, మృతి చెందిన బీఆర్ఎన్ కార్యకర్తల కుటుంబ సభ్యులకు రూ 2లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ ఆవరణలో సుమారు 2వేల మంది భోజనం చేశారు. ఈ సందర్భంగా "జై తెలంగాణ జై జై తెలంగాణ","హ్యాపీ బర్త్డేటూ కెసిఆర్ హ్యాపీ బర్త్డే హ్యాపీ బర్త్డే","లాంగ్ లైవ్ లాంగ్ లైవ్ కెసిఆర్ లాంగ్ లైవ్ ","వర్థిల్లాలి వర్థిల్లాలి కేసీఆర్ వర్థిల్లాలి"అనే నినాదాలు హోరెత్తాయి.

# యాక్సిస్ బ్యాంకుతో పేటీఎం భాగస్వామ్యం.. మర్చంట్ పేమెంట్స్ యథాతథం..!

హైదరాబాద్, ఫిబ్రవరి 17:ప్రముఖ ఫిన్ టెక్ సంస్థ 'పేటీఎం పేమెంట్స్ బ్యాంకింగ్ లిమిటెడ్ (పీపీబీఎల్)'పై తన మర్చంట్ల సౌకర్యార్థం కీలక నిర్ణయం తీసుకున్నది. ఇందుకోసం ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ యాక్సిస్ బ్యాంక్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నది. దీంతో పేటీఎం క్యూఆర్ కోడ్, సౌండ్ బాక్స్, కార్డు మెషిన్లతో యధాతథంగా ఆపరేషన్లు నిర్వహించవచ్చు. ఇందుకోసం యాక్సిస్ బ్యాంకులో పేటీఎం పేరెంట్ సంస్థ 'వన్97 కమ్యూనికేషన్స్'.. ఎస్క్రో ఖాతాను ప్రారంభించనున్నది. దీని ప్రకారం పేటీఎం తన నోడల్ అకౌంట్‌ను యాక్సిస్ బ్యాంకుకు ట్రాన్స్ ఫర్ చేస్తుంది. దీంతో పేటీఎం మర్చంట్స్ సెటిల్మెంట్లు యధాతథంగా కొనసాగుతాయి. మార్చి 15 తర్వాత కూడా మర్చంట్లందరి వద్ద పేటీఎం యాప్, పేటీఎం క్యూఆర్ కోడ్, సౌండ్ బాక్స్, కార్డ్ మెషిన్ కొనసాగుతాయి.

కేవైసీ సహా పలు రెగ్యులేటరీ నిబంధనలను అమలు చేయడంలో పేటీఎం పేమెంట్స్ బ్యాంకింగ్ లిమిటెడ్ (పీపీబీఎల్) విఫలమైందని బయటి ఆడిటింగ్ సంస్థలతో ఆర్బీఐ నిర్వహించిన అడిటింగ్‌లో తేలింది. దీంతో ఈ నెల 29 నుంచి ఖాతాదారుల నుంచి డిపాజిట్ల సేకరణ, కస్టమర్లకు క్రెడిట్ ఫెసిలిటీ, టాపప్ రుణ పరపతి కల్పన, ఫాస్టాగ్ సేవలు, తదితర సర్వీసులు నిర్వహించొద్దని పేటీఎంను ఆర్బీఐ గత నెల 31న ఆదేశించింది. కస్టమర్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిషేధాన్ని మార్చి 15 వరకూ సడలించింది.

# ఎమ్మెల్సీ ఓటుహక్కు నమోదు చేసుకోండి

## – జిల్లా కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్

ఖమ్మం, ఫిబ్రవరి 17:(నేటినిజం ప్రతినిధి): అర్హులైన పట్టభద్రులు ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు పరికపల్లి శ్రీనివాస్ శనివారం ఒక పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఓటర్ నమోదుకు గడువు ఇంకా ముగియలేదని మార్చి 14వ తేదీ వరకు పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

నవంబర్ 1, 2020 నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ఓటు వినియోగం ఎంతో ప్రాముఖ్యమైనదని అందుకు పట్టభద్రులు వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సి ఓటులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతే కాకుండా త్వరలో జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మొదటి ప్రాధన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# సౌత్ ఆఫ్రికాలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



హైదరాబాద్, ఫిబ్రవరి 17: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను సౌత్ ఆఫ్రికా లో శనివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ శాఖ సౌత్ ఆఫ్రికా శాఖ ఆధ్వర్యంలో జోహన్స్‌బర్గ్ కేప్‌టౌన్, డర్బన్ రాష్ట్రాల్లో నిర్వహించారు. జోహన్స్‌బర్గ్‌లో న్యూలైఫ్ సెంటర్ ఫర్ గర్ల్స్ గృహములో సరుకులను పంపిణీ చేసి, చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ సౌత్ ఆఫ్రికా శాఖ అధ్యక్షులు నాగరాజు గుర్రాల, కోర్ కమిటీ సభ్యులు, కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.కేప్‌టౌన్ లో మసిజిసినే చిల్డ్రన్స్ హోంలో బీఆర్ఎస్ నాయకులు వీరన్నగాండ్ల, చేతన్ కోరబోయిన, డర్బన్‌లో సెయింట్ థామస్ హోమ్ ఫర్ చిల్డ్రన్స్‌లో షేక్‌బాబా ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందజేశారు. జొహన్నెస్బర్గ్ లో నరేందర్ మేడసాని, హరీష్ రంగ, కిరణ్ కుమార్ బెల్లి, అరవింద్ చికోటి, సుఖేష్ అలుగురి , రాంబాబు తోడుపు నూరి, జ్యోతి వాస రెడ్డి, శిరీష కట్ట , వెంకట్ రావు తాళ్ల పల్లి, రంజిత్ కుమార్ పాల్గొన్నారు. కేసీఆర్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

# రూ. 8 కోట్ల డ్రగ్స్ కేసు..కీలక నిందితుడు అరెస్ట్ ..

హైదరాబాద్, ఫిబ్రవరి 17:హైదరాబాద్ నగరంలోని పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో దాదాపు 8 కోట్ల రూపాయల విలువ చేసే డ్రగ్స్ కేసులో మరో కీలక నిందితుడు సౌరవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. టీఎస్ న్యాబ్ పోలీసులు పుణెలో సౌరవ్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్ కు తీసుకొచ్చారు. పంజాగుట్ట పోలీసులు విచారణ తర్వాత కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తీసుకెళ్లారు. మరోవైపు స్టాన్లీని ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని కీలక సమాచారాన్ని విచారిస్తున్నారు.

ఇక, వ్యాపార వీసాపై వచ్చిన స్టాన్లీ గోవాలో బట్టల వ్యాపారం చేస్తున్న టైంలో కండోలిమ్ ప్రాంతంలో ఉంటున్న డ్రగ్స్ సరఫరా చేసే నైజీరియన్లతో పరిచయం ఏర్పడింది. ఇందులో భాగంగా ఓక్రా సహా మరో ఇద్దరితో కలిసి నిందితుడు చిన్న మొత్తంలో మత్తు పదార్థాలు అమ్మకం ప్రారంబించాడు.. కాగా, రెండేళ్ల క్రితం ఓక్రా సహా మరో ఇద్దరు డ్రగ్స్ కేసులో అరెస్టై జైలుకు వెళ్లిపోగా.. దీంతో స్టాన్లీకి విదేశాల నుంచి డ్రగ్స్ వచ్చే మార్గం క్లోజ్ అయింది.

అయితే, గోవా జైలు నుంచే ఓక్రా డ్రగ్స్ బిజినెస్ కొనసాగించాడు. ఇందులో ఓక్రాకి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సౌరభ్ సహకరిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నైజీరియా నుంచి డ్రగ్స్ తెప్పించి సౌరభ్‌కు ఓక్రా ఇచ్చేవాడు.. ఓక్రా ఆదేశాలతో స్టాండ్లీకి సౌరభ్ డ్రగ్స్ సరఫరా చేశాడు. అలాగే, తెలంగాణ డ్రగ్ కంట్రోల్ అధికారుల సమాచారంతో గోవా జైలులో సోదాలు చేయగా.. జైలులో ఉన్న ఓక్రా దగ్గర 16 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓక్రాతో పాటు పలువురు జైలు నుంచే డ్రగ్స్ బిజినెస్ లో పాల్గొన్న వారిని అరెస్ట్ చేసి పంజాగుట్ట పోలీసులు రిమాండ్ కు తరలించారు.

# ఈటల రాజేందర్ కాంగ్రెస్‌లో చేరబోతున్నారా..

# హస్తం నేతలతో భేటీపై క్లారిటీ ఇచ్చిన బీజేపీ నేత

హైదరాబాద్, ఫిబ్రవరి 17:ఇటీవల కాంగ్రెస్ నాయకులతో బీజేపీ నేత ఈటల రాజేందర్ భేటీ అవ్వడం రాజకీయంగా దుమారం రేపింది.

ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో ఈటల బీజేపీకి గుడ్‌బై చెప్పబోతున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో స్పందించిన ఈటల.. కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు వచ్చిన వార్తలను ఖండించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఈటల రాజేందర్.. బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి చేతిలో ఘోర ఓటమి పాలయ్యారు. అప్పట్నుంచి ఈటల మౌనంగా ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనడం లేదు. దీంతో ఈటల పార్టీ మారబోతున్నారని ప్రచారం మొదలైంది. పైగా కాంగ్రెస్ నాయకులతో ఆయన లంచ్ చేస్తున్న ఫొటోలు ఇటీవల బయటకు రావడం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చాయి. ఆ ఫొటోలను చూపిస్తూ ఈటల కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం ఎక్కువయ్యింది. ఈ క్రమంలో స్పందించిన ఈటల రాజేందర్.. కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు వచ్చిన వార్తలను ఖండించారు. ఓ కార్పొరేటర్ గృహప్రవేశ కార్యక్రమంలో అందరితో కలిసి భోజనం చేశానని.. ఆ సమయంలో తీసిన ఫొటోపై దుష్ప్రచారం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.